
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 26.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు
జిల్లా వార్తలు

శనివారం 8 జూన్ 2024



ఓటుపై .. విరక్తి ఎందుకో..!

- పెరుగుతున్న నోటా పోలింగ్ శాతం

నిడమర్రు జూన్ 7 : ప్రజాస్వామ్యంలో ఓటరు చేతిలో నిశ్శబ్ద విప్లవంగా నోటా మారుతోంది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల తీరు నచ్చకో.. రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు నచ్చకో.. ఎన్నికల సరళి నచ్చకో.. ఏదైతేనేం పోటీ చేస్తున్న అభ్యర్థులు తనకు నచ్చలేదంటూ ... ఓటరు పోలింగ్ బూత్‌కు పనిగట్టుకొని వచ్చి మరీ తెలియజేస్తున్నాడు. తనకు నచ్చకపోతే పోలింగ్ బూత్ రాకుండా ఉండవచ్చు. కానీ తన అసంతృప్తిని పదిమందికి తెలపడమే లక్ష్యంగా నోటాను సామాన్యుడు వినియోగిస్తున్నాడు. ఈ మారుతున్న పరిణామాలు ప్రజాస్వామ్యంలో కొత్త ధోరణిని తీసుకొస్తోంది. ఎన్నికల సంఘం 2013 రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం, చత్తీస్‌ఘడ్, ఢిల్లీ రాష్ట్రాలకు జరిగిన ఎన్నికలలో తొలిసారి ఈవీఎంలలో ఈ నోటా ఆప్షన్ కేటాయించింది. ఇటీవల వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విశ్లేషిస్తే ఏలూరు పార్లమెంటరీ నియోజవర్గంలో నోటాకు 22,515 ఓట్లు నమోదయ్యాయి. ఇక్కడ మొత్తం 13 లక్షల 82 వేల ఓట్లుండగా గెలుపొందిన టీడీపీ అభ్యర్థికి 7లక్షల 46 వేల ఓట్లు, సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థికి 5లక్షల 64 వేల ఓట్లు రాగా నోటా 22వేల 515 ఓట్లుతో మూడో స్థానంలో నిలవడం గమనార్హం. జాతీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ సాధించిన 20,826 ఓట్లు కన్నా నోటా కు అధిక ఓట్లు రావడం చర్చనీయాంశంగా మారింది. ఇక ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఉంగుటూరు అసెంబ్లీ స్థానం పరిధిలో నోటాకు 2,105 ఓట్లు, దెందులూరు- 1,920 ఓట్లు, ఏలూరు- 1,256 ఓట్లు, పోలవరం నియోజకవర్గంలో అత్యధికంగా 5,611 ఓట్లు, చింతలపూడి- 4,121 ఓట్లు, నూజివీడు 2,771 ఓట్లు, కైకలూరులో 1,598 నోటా ఓట్లు నమోదయ్యాయి. అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా మొత్తం 19,382 ఓట్లు నమోదు కావడం విశేషం.

నోటా ఓట్లు వృథాయేనా..!

ప్రస్తుత ఎన్నికల నిబంధనల ప్రకారం నోటాకు వేయబడిన ఓట్లు ఎన్నికల ఫలితాలపై ఎటువంటి ప్రభావం చూపలేకపోతున్నాయి. అభ్యర్థులపై వ్యతిరేకత ఉన్నా నోటాకు వేసే ఓట్లతో ఫలితాలపై ఏ ప్రభావం ఉండకపోవడమే ఇందుకు నిదర్శనం. నోటా ఓట్లు సరళిని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు ఎన్నికల్లో నోటా శాతం బట్టి ఆ ఎన్నికను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ ఆచరణ అవుతుందో లేదో చూడాలి.

ఎందుకిలా?



సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయిన ఇంకా కూడికలు, తీసివేతలతోనే కూటమియేతర నేతలు కుస్తీలు పడుతున్నారు. కూటమికి అనూహ్య విజయం లభించినా తమ పార్టీలు ఎందుకింత వెనుబడ్డాయి, ఎవరెవరూ మద్దతివ్వ లేదు, గ్రామాల్లో అంతర్గతంగా జరిగిందేమిటి, బలబలాల్లో లెక్క ఎక్కడ తప్పింది.. ఈ తరహా అంతర్మథనంలోనే నేతలున్నారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో లభించిన ఓట్లు ఈసారి దక్కిన ఓట్ల నడుమ వ్యత్యాసం తక్కువగానే ఉన్నా సీట్లు గల్లంతు వెనుక అంతరార్థంపై ఆరా తీస్తున్నారు. వైసీపీలో కొందరు నేతలైతే పరాజయం తమ స్వయంకృతంగానే భావిస్తున్నారు. వైసీపీలో ఓట్లు చీలికకు కాంగ్రెస్ పోటీ కారణం కాగలదని భావించినా అది మాత్రం రివర్స్ అయింది. జనసేన, బీజేపీలు పొత్తు కారణంగా ఆసాంతం లబ్ధి పొందాయి.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

కూటమియేతర పక్షాల్లో అంతర్మథనం

- వైసీపీకి ఓట్లు దక్కినా సీట్లు గల్లంతు
- గతంలో టీడీపీకి ఇదే అనుభవం
- ఈసారి లాభపడింది జనసేన, బీజేపీ
- తిరగబడిన కాంగ్రెస్ ఓట్ల చీలిక వ్యూహం.. గత ఎన్నికల కంటే దక్కిన ఓట్లు తక్కువే
- నామినేటెడ్ పదవుల లెక్కల్లోనూ నేతలు

గతంలో కంటే భారీగానే..

గత ఎన్నికల్లో ఏ పార్టీ కూడా పొత్తు లేకుండానే ఒంటరిగానే బరిలోకి దిగాయి. నువ్వా నేనా అన్నట్లు తేల్చుకోవడానికి సిద్ధపడ్డాయి. సొంత బలం మీదే అంచనాలకు వచ్చి మరీ అటు పార్లమెంటులోనూ, ఇటు అసెంబ్లీలోనూ పోటీకి దిగి తలపడ్డాయి. గత ఎన్నికల్లో తెలుగుదేశం ఒంటరిగా పోటీ చేసినప్పుడూ వివిధ నియోజకవర్గాల్లో ఒక్క స్థానంలోను లక్షకు పైగా ఓట్లను దక్కించులేదు. అప్పట్లో జనసేన, బీజేపీ విడివిడిగానే పోటీ చేశాయి. ఈ నేపథ్యంలో అప్పట్లో అత్యధికంగా ఒక్క నూజివీడులోనే 85 వేలకు పైగానే ఓట్లను టీడీపీ దక్కించుకోగలిగింది. మిగతా ఆరు నియోజక వర్గాల్లోనూ కాస్త తక్కువ గానే ఓట్లు లభించినా ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఒక్క స్థానం కూడా నిలుపుకోలేక పరాజయం పాలైంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం మీద ఐదు లక్షల 14 వేల ఓట్లు మాత్రమే దక్కాయి. కాని అదే 2024 ఎన్నికల్లో మాత్రం తిరుగులేని ఆధిక్యతను టీడీపీ పోటీ చేసిన నాలుగు నియోజకవర్గాల్లోనూ ఓట్ల ఆధిక్యతను దక్కించుకోగలిగింది. దెందులూరు, నూజివీడు, ఏలూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో తెలుగుదేశం అభ్యర్థులు పోటీ చేయగా ఈ నాలుగింటిలో 4 లక్షల 47 వేల 204 ఓట్లు టీడీపీ దక్కాయి. ఒక్క పోలవరం మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీ చేసిన అభ్యర్థులందరికీ లక్ష పైచిలుకు ఓట్లు లభించాయి. జనసేన పోటీ చేసిన పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లో రెండింటి మీద కలిపి 2 లక్షల 10 వేల 347 ఓట్లు ఆ పార్టీకి దక్కాయి. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కలిపి లక్ష లోబడే ఓట్లు ఆ పార్టీకి దక్కాయి. ఈసారి కూటమి నేపథ్యంలో జనసేనకు రెండు నియోజకవర్గాల్లోనూ ఇద్దరు అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడంతో పాటు ఉంగుటూరులో జనసేనకు భారీ ఆధిక్యత దక్కడం విశేషం. కూటమిలో భాగస్వామి అయిన బీజేపీ సైతం కైకలూరులో లాభపడింది. ఈ నియోజకవర్గంలో భారతీయ జనతాపార్టీకి లక్షా 9 వేల 280 ఓట్లు దక్కాయి. కూటమి పక్షాన ఈ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని వైసీపీని పూర్తి దెబ్బతీసి దాదాపు 7 లక్షల 66 వేల 831 ఓట్లు కూటమి సొంతమయ్యాయి. అదే వైసీపీలో ఏడు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులందరికి 5 లక్షల 39 వేల 880 ఓట్లు లభించాయి. కూటమికి వైసీపీకి మధ్య వ్యత్యాసం 2.26 లక్షల ఓట్లే కావడం ఇంకో విచిత్రం. గడిచిన ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు పరంగా భారీగా పడినా సీట్లు పరంగా ఒక్కటి కూడా దక్కలేదు. ఇప్పుడు అదే వైసీపీలోనూ పునరావృతమైంది.

ఎంపీ స్థానానికి వచ్చేసరికి గత ఎన్నికల్లో అక్కడ వైసీపీ అభ్యర్థి కోటగిరి శ్రీధర్‌కు 6 లక్షల 76 వేలకు పైగా ఓట్లు దక్కగా, టీడీపీ అభ్యర్థి మాగంటి బాబుకు 5 లక్షల 10 వేల పైచిలుకు ఓట్లు పడ్డాయి. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పుట్ట మహేష్‌కు 7 లక్షల 66 వేల 831 ఓట్లు లభించగా, వైసీపీ అభ్యర్థికి 7 లక్షల 39 వేలు ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య వున్న వ్యత్యాసం సమాంతరంగా ఎంపీ అభ్యర్థుల్లోనూ బయట పడినట్లయింది. ఇప్పుడు ఈ రెండు పార్టీల బలాబలాలను బేరీజు వేసుకుని ఆ తర్వాత తదుపరి వ్యూహాలకు సిద్ధమవుతున్నారు. వాస్తవానికి గడిచిన రెండు సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే ఈసారి జరిగిన ఎన్నికల్లో వైసీపీకి కోలుకోలేనంత దెబ్బ తగిలినట్లయింది. కోలుకోవడానికి సమయం పడుతుందని, త్వరపడి నిర్ణయాలు తీసుకుంటే తమకే నష్టమనే రీతిలో వైసీపీ నేతలున్నారు. ఇప్పటికే ఏడు నియోజకవర్గాల్లోనూ వైసీపీ కేడరు తమ పార్టీ పరాజయానికి రకరకాల కారణాలు చెబుతూనే వున్నారు.

వైసీపీలో ఎడతెగని అంతర్మథనం

ఇప్పటికే ఇటు వైసీపీలోనూ ఎన్నికల ఫలితాలు అంతర్మథనంలో ముంచి తేల్చాయి. ఇప్పటికే ఆ పార్టీలో ఎక్కడికక్కడ పదవులు అనుభవిస్తున్నవారు లేకపోలేదు. ఏలూరు కార్పొరేషన్‌తో సహా జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలోనూ, నూజివీడు మునిసిపాలిటీలోనూ వైసీపీదే ఆధిక్యత. దీనికి తోడు ఆయా మునిసిపాలిటీల్లో బలాబలాలు పరిశీలిస్తే గత ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యత దక్కించుకున్నారు. ఇప్పుడు తాజా ఫలితాల ప్రకారం కౌన్సిలర్లు గోడ దూకుడు అవలంబిస్తే ఇక్కడ కూడా పరిస్థితి తారుమారు కాబోతుంది. వైసీపీలో ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల్లో అనేకమంది ఉన్నారు. సమాంతరంగా మార్కెట్ యార్డుల్లోనూ వీరిదే పెత్తనం. సహజంగానే ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి చెందిన వ్యక్తులకే నామినేటెడ్ పోస్టులు దక్కుతాయి. ఇప్పుడు అధికార మార్పిడి జరిగింది కాబట్టి పదవుల్లో వున్నవారంతా తప్పుకోవాల్సిందే. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్ యార్డుల్లో వున్న పాలక మండలిలో మార్పులు, చేర్పులు తప్పనిసరి కాబోతున్నాయి. ఈనెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నియమ నిబంధనలన్నీ అమల్లోకి వస్తాయి. వైసీపీలో ఆసాంతం దీనిమీదే చర్చ జరుగుతోంది. ఓ వైపు ఓట్లు దక్కాయి గాని సీట్లు పోయాయి.. వీటికి తోడు నామినేటెడ్ పోస్టులు గల్లంతు కాబోతున్నాయని వీరంతా మదనపడుతున్నారు. ఈ మధ్యనే టీడీపీలో చేరిన కొందరు తమకు ఏ పదవి కావాలో ఆనాడే తమ డిమాండ్‌గా వెల్లడించారు. ప్రత్యేకించి పట్టణ, నగర ప్రాంతాల్లో వున్నవారు అత్యాధికులు నామినేటెడ్ పోస్టుల్లో వున్నందున అవి ఖాళీ కాగానే వాటిల్లో తాము ఆశీనులయ్యేందుకు తెలుగుదేశం, మిత్రపక్షాల నేతలు సిద్ధంగా వున్నారు. వైసీపీలో ఇప్పటికే కార్పొరేషన్ స్థాయిలో ఛైర్మన్‌గా వున్నవారు కూడా ఎన్నికల్లో ప్రభావశీలురుగా పాత్ర పోషించలేకపోయారు. సామాజికవర్గాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తిరిగి అధికారంలోకి వస్తే అదే సామాజికవర్గాలకు చెందిన మరొకరికి ఇవ్వాలని ఈ మధ్యనే వైసీపీ భావించింది. కానీ అది కాస్త తిరగబడింది. అలాగే కూడికలు, తీసివేతల్లో భాగంగా ఛైర్మన్లు, డైరెక్టర్లు సొంత గ్రామాల్లో పార్టీకి లభించిన ఓట్లపైన వైసీపీ దృష్టి పెట్టింది.

కాంగ్రెస్ అప్పుడు.. ఇప్పుడు అంతే !

పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ పార్టీ అనూహ్యంగా ఈ ఎన్నికల్లో ఓట్లు దక్కించుకుంటుందని అందరూ అంచనా వేశారు. ప్రత్యేకించి వైసీపీలో వున్న పాత కాంగ్రెస్ వర్గం కొంత చొరవ చూపి కాంగ్రెస్ వైపు మళ్లడం ఖాయమంటూ లెక్కలు వేశారు. పార్టీ పరంగా నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన అభ్యర్థులు ఈసారి కాస్తంత స్పీడు పెంచి అనూహ్యంగా ఓట్లను దక్కించుకుంటారని, అది కాస్త వైసీపీకే ఎక్కువ నష్టదాయకమని లెక్కలు కట్టారు. అయితే ఇదంతా ఫలితాలు వెలువడిన తర్వాత గాలి బుడగైంది. కాంగ్రెస్ పార్టీకి 2019 లో ప్రత్యేకంగా అభ్యర్థులను ముందుకు నడిపించే యంత్రాంగం లేదు. కేవలం పీసీసీ ఆదేశాల మేరకే నడుచుకుపోవడమే తప్ప ప్రత్యేక చొరవ తీసుకున్నవారు లేరు. 2019లో ఎంపీ స్థానంలో పోటీ చేసిన జెట్టి గురునాథరావుకు 25 వేల 826 ఓట్లు దక్కాయి. అప్పట్లో కాంగ్రెస్ ఇన్ని వేల ఓట్లు దక్కడమే ఆశ్చర్యకరమన్నారు. దీనికి తోడు జెట్టి వ్యక్తిగత ఇమేజ్‌గా కూడా ఇంకొందరు అభివర్ణించారు. ఆనాటి ఎన్నికల్లో ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఎవరితోనూ పొత్తు లేకుండా ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థులను పోటీకి దింపారు. ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు కేవలం 18,752 ఓట్లు లభించాయి. కాంగ్రెస్‌లో లోపించిన నాయకత్వం, ఆర్థికలేమి, కిందిస్థాయిలో చెదిరిపోయిన కేడరే దీనికంతటికి కారణంగా భావించారు. కానీ తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన పీసీపీ అధ్యక్షురాలు షర్మిల దెందులూరుతో పాటు మరికొన్ని నియోజకవర్గాల్లో పర్యటించి సీఎం జగన్‌పైన విరుచుపడ్డారు. కాంగ్రెస్ సభలకు కాస్త సంతృప్తికరంగానే జనం హాజరయ్యారు. ఇంతా చేస్తే ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో మహిళా అభ్యర్థిని రంగంలోకి దింపితే ఆమెకు 20,378 ఓట్లు దక్కాయి. గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థికి, తాజాగా పోటీ చేసిన అభ్యర్థికి లభించిన ఓట్ల వ్యత్యాసం 498 ఓట్లు మాత్రమే. అదేవిధంగా ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులకు 2019లో 18,752 ఓట్లు కాగా, ఈసారి అయా నియోజకవర్గాల్లో లభించిన ఓట్లు 18,054 ఓట్లు మాత్రమే. గతం కంటే 698 ఓట్లు తక్కువగా వచ్చినట్లు లెక్క తేలింది. కాంగ్రెస్ పోటీ ద్వారా ఓట్ల చీలిక భారీగా ఉంటుందనే అంచనాలకు వాస్తవ అంచనాలకు మధ్య పొంతన లేకుండా పోయింది. దీంతో కాంగ్రెస్ పోటీ ఈసారి కూడా తేలిపోయింది. ఎటు తిరిగి కొన్నిచోట్ల స్వతంత్ర అభ్యర్థులు భారీగానే ఓట్లు దక్కించుకోగలిగారు. ప్రధాన పార్టీగా వున్న కాంగ్రెస్ మాత్రం ఆ మేరకు ఈసారి కూడా ఎదగలేకపోయింది. ఈ ప్రభావమంతా ఆ పార్టీపై గట్టిగానే పొడచూపనుందని చెబుతున్నారు.

పందెం గెలిచినా..

- నిండా మునిగిన పందెంరాయుళ్లు
- మధ్యవర్తుల దెబ్బకు గగ్గోలు
- నూజివీడు నియోజకవర్గంలో రూ.200 కోట్ల వరకు పందేలు



(నూజివీడు):

ఎన్నికల ఫలితాలపై రాజకీయ బెట్టింగ్‌లతో చిన్న, మధ్య తరగతి వర్గాలు కుదేలైతే కొంత మంది రాజకీయ పక్షాల నాయకులు మాత్రం బెట్టింగ్‌లలో కోట్లలో సంపాదించడం విశేషం. ఒక స్థాయిలో అధికారం తమ దంటే తమదంటూ లక్షకు రెండు లక్షల వరకు పందేల కు దిగారు. ఈ విధంగా ఏలూరు జిల్లాలోని ఒక్క నూజివీడు నియోజకవర్గంలోనే దాదాపు రూ.200 కోట్ల వరకు అభ్యర్థుల గెలుపు, ఓటమిలపై పందేలు సాగాయి. చిన్న, మధ్యతరగతి వర్గాలు అప్పు చేసి మరీ లక్ష నుంచి రూ.పది లక్షల వరకు పందేలు కాసి నష్టపోవడంతో కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితి నెలకొంది. ఇక బడా నాయకులైతే ఈ పందేల్లో కోట్లు సంపాదించారు.

కొత్త పుంతలు తొక్కిన పందేలు

ఎన్నికల ఫలితాలపై సాగిన పందేలు ఈసారి కొత్త పుంతలు తొక్కాయి. మెజారిటీ, ప్రభుత్వ ఏర్పాటుపైనే కాక నిర్ణీత అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెట్టి ఆ సంఖ్యను మించి ఎన్ని సీట్లు వస్తే ఒక్కో సీటుకు రెండు లక్షల వరకు ఇచ్చేలా పందేలు సాగాయి. ఎక్కువ వస్తే వైసీపీ మద్దతుదారులు టీడీపీ వారికి ఇచ్చేలా తక్కువ వస్తే టీడీపీ వారు వైసీపీకి ఇచ్చేలా పందేలు సాగడంతో నియోజకవర్గంలోని ఓ గ్రామంలో ఒక పందెంలోనే ఏకంగా కోటిన్నర వరకు చేతులు మారాయి.

నిండా ముంచిన మధ్యవర్తులు

ఎన్నికలకు సంబంధించి జరిగిన పందేల్లో మధ్య వర్తుల వ్యవహార శైలి పందెంరాయుళ్ళ కొంప ముంచింది. పందెంరాయుళ్ళ నుంచి డబ్బు తీసుకుని మధ్య వర్తులుగా పందేలను నడపాల్సిన వారు తాము సైతం గెలుపు, ఓటమిలపై ఆ డబ్బుతో పందేలకు దిగారు. దీంతో పందెంరాయుళ్ల డబ్బు మరో పందేల వైపు వెళ్ళి ఇటు మధ్య వర్తులను, అటు పందెం రాయుళ్ళను ఇరకాటంలో పడేసేలా చేశాయి. నూజివీడు మండలం తూర్పు దిగవల్లి గ్రామంలో ఓ మధ్యవర్తి వద్ద వుంచిన కోట్ల రూపాయలతో పరారవడంతో పందెం రాయుళ్లు ఆయన ఇంటిపై దాడి చేశారు. ఇంటిలోని కారు, బంగారు వస్తువులు, ఫర్నీచర్ తీసుకుని వెళ్లిపోయారు. మధ్యవర్తుల దెబ్బకు కొందరు పందెంరాయుళ్ళు పందెం వస్తుందనుకుంటే ఉన్న డబ్బులు పోవడంతో లబోదిబోమంటే కొందరు పందెంరాయుళ్ళు తట్టాబుట్టా, ఇల్లు వాకిలి పశువులను అన్నింటిని తెగనమ్మి డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూజివీడు మండలంలోని ఓ గ్రామ నాయకుడు ఇంటితో సహా అమ్మకానికి పెట్టి పందేల డబ్బులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆగిరిపల్లి మండలంలోని ఒక గ్రామంలో మరో నాయకుడు సైతం మొత్తం ఆస్తిని అమ్మినా పందెం డబ్బులు కట్టే పరిస్థితి లేక, చేతులెత్తేశాడు.

తిలా పాపం తలా పిడికెడు..

పందెం డబ్బు ఓ కుటుంబం ఉసురు తీసి వస్తోంది. ఆ పాపం తమకు అంటకూడదంటే ఏం చేయాలి. తలాపాపం తిలాపిడికెడు అన్న సామెత ఉండనే ఉంది. కోటి రూపాయలు పందెం రూపంలో వస్తే వాటిలో నుంచి ఓ లక్ష దానధర్మాలు చేస్తే సరి అని పందెంరాయుళ్ళు ఆ పాపాన్ని నివృత్తి చేసుకునేందుకు నూజివీడు నియోజక వర్గంలో తెర తీశారు. అనాథ ఆశ్రమాల్లో అన్నదానాలు, బాటసారులకు పలు రకాల సేవలు అందిస్తూ దానిని టీడీపీ గెలుపుపై సంబరాలు అంటూ పై పూతలు పూయడం విశేషం.



సేద్యంపై చిన్నచూపు

- రైతులకు అందని సబ్సిడీ పనిముట్లు
- పథకాన్ని అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం
- మార్కెట్‌లో భారీగా పెరిగిన వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు
- కొనుగోలుకు జంకుతున్న రైతులు



(ఏలూరు రూరల్) :

వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ దుక్కులు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. సాగు కలిసిరాక అప్పుల ఊబిలో చిక్కుకున్న జిల్లా రైతులు వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయడం భారంగా మారింది. టీడీపీ హయాంలో సబ్సిడీతో పంపిణీ చేసేవారు. దీంతో రైతన్నలకు చాలా ఉపశమనం దక్కేది. వైసీపీ అధికారాన్ని చేపట్టిన తర్వాత సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పంపిణీకి తిలోదకాలు ఇచ్చింది. సబ్సిడీ ఎత్తేశారు. గతేడాది వర్షాభావం, అకాల వర్షాలు, తుపాన్‌తో పంట తుడిచిపెట్టుకుపోయింది. పెట్టుబడి కూడా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి సేద్యం పనులు చేయడం వారికి భారంగా మారింది.

వైసీపీ పాలనలో అంతా ఆర్భాటమే

ప్రతి రైతుకు గతంలో పాడి ఎద్దులు ఉండేవి. సేద్యానికి ఇబ్బంది ఉండేది కాదు. కొన్నేళ్లుగా పశుపోషణ భారమైంది. తాగునీరు, గ్రాసం దొరకని పరిస్థితులు తలెత్తాయి. చేసేది లేక పాడి ఎద్దులను అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం సేద్యం చేయాలంటే ట్రాక్టర్లే దిక్కు. టీడీపీ హయాం లో 50 శాతం సబ్సిడీతో నాగలి, బాపణం, రోటో వేటర్లు, కేజీవీల్స్‌తో పాటు వ్యవసాయ నూర్పిడికి పలు యంత్రాలను అందించారు. వైసీపీ అధికారం చేపట్టాక రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిం ది. వాటిలో అన్ని రకాల పురుగుల మందులు, ఎరువులు అందుబాటులో ఉంచుతామని ప్రగల్భాలు పలికారు. గ్రూప్‌లు ఏర్పాటు చేసి ట్రాక్టర్లను అంద జేశారు. వంతుల వారీగా పొలాలు దుక్కులు చేసుకోవాలని సూచించారు. ట్రాక్టర్‌ను ఒక రైతు పేరుతో మంజూరు చేసింది. మిగతా రైతులకు తక్కువ అద్దెకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ రైతే సొంతం చేసుకుని గ్రూపులోని మిగతా రైతులకు ఇచ్చిన పాపాన పోలేదు. దీంతో ఆ పథకం నిరుపయోగమైంది. ప్రస్తుతం ట్రాక్టర్ ఉన్న రైతులు పెరిగిన ధరల ను చూసి వ్యవసాయ పరికరాల కొనుగోలు కు జంకుతున్నారు. గతంలో ఇచ్చిన పరికరాలు పనికి రాకుండా పోయాయి. బయట మార్కెట్లో కొందామంటే లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ పరికరాలు ఇవ్వకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

భారీగా పెరిగిన ధరలు

వ్యవసాయ పరికరాల ధరలు ఈ ఏడాది బాగా పెరిగాయి. స్ప్రింగ్ మడకలు రూ.32 వేలు, ఏడు మడకలు రూ.30 వేలు, ఐదు మడకలు రూ.70 వేలు, పాపనగుంటకు రూ.28 వేలు, బోదిగుంటక రూ.40 వేలు, విత్తన గొర్రు రూ.85 వేలు, రోటోవేటర్ రూ.లక్షా 25 వేల వరకు ధరలు పలుకుతు న్నాయి. వీటిని చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీతో గతంలో అందించే వారు. ఎద్దుల పరికరాలైన నాగళ్ళు విత్తనం గొర్రు, ఎద్దుల బండ్లు, సబ్సిడీకి అందించి వరి నూర్పిడి పరికరాలను కూడా అందించే వారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేట్ ట్రాక్టర్లకు రూ.1,100 వెచ్చించి సేద్యం చేయాలంటే కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. ధరలు ఆమాంతం పెరిగాయని సబ్సిడీతో పరికరాలు పంపిణీ చేయక పోవడంతో బహిరంగ మార్కె ట్లో పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయ లేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా ఒక్క పరికరం కూడా ఇవ్వలేదని, ప్రస్తుత సీజన్‌లో దుక్కులు ఎలా చేసుకోవాలో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి స్కూలుకు రాకపోతే..

ఇళ్లకు వెళ్లండి : డీఈవో

- ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 7 : వేసవి సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలు తెరిచిన తర్వాత ఏ విద్యార్థి అయినా వరుసగా ఐదు రోజులపాటు స్కూలుకు రాకపోతే ఉపాధ్యాయులు ఆ విద్యార్థి ఇంటికెళ్ళి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను తరగతులకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో అబ్రహం సూచించారు. నూతన విద్యాసంవత్సరం ఈనెల 12 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాల్సిన కార్యక్రమాలు, ఉపాధ్యాయుల సమస్యలు, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలపై శుక్రవారం ఏలూరులోని తన కార్యాలయంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని ఏ ఒక్క పాఠ శాలలోనూ ఉపాధ్యాయుల కొరత లేకుండా ఎక్కువ సంఖ్యలో టీచర్లువున్న పాఠశాలల నుంచి కొరత వున్న స్కూళ్ళకు తాత్కా లికంగా సర్దుబాటు చేస్తున్నామన్నారు. బాల బాలికల ఎన్‌రోల్ మెంట్‌ను పెంచేందుకు ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో విద్యార్థుల ఇళ్ళను సందర్శించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘా ల నుంచి పలు అభ్యర్థనలు వచ్చాయి. ప్రాథమిక పాఠశాలల్లోని 1, 2, 3 తరగతులను సమీప హైస్కూళ్లకు తరలించి విలీనం చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందని, ఈ సమస్యను పరిష్కరించడానికి జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేయగా, ఈ విషయం ప్రభుత్వ పరిధిలో ఉంటుందని డీఈవో వివరించారు. పాఠ్యపుస్తకాలను సకాలంలో పాఠశాలలకు సరఫరా చేస్తే బోధనకు ఆటంకం లేకుండా ఉంటుందని సంఘాల నాయకులు సూచించారు. ఇంటర్ విద్యతో ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లలో పనిచేస్తున్న పీజీటీలకు పాఠశాల విద్యాశాఖ లేదా ఇంటర్‌బోర్డు పనివేళలను వర్తింపజేసే విషయమై నెలకొన్న సందిగ్ధతను తొలగించాలని అభ్యర్థించారు. మునిసిపల్ టీచర్ల పదోన్నతులు, బదిలీలకు కామన్ సీనియార్టీ జాబితాను విడుదల చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు విడివిడిగా డీఈవోకు వినతి పత్రాలను అందజేశారు. సమావేశంలో డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు అవధాని, షరీఫ్, సూపరింటెండెంట్లు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, సుబ్బారావు, పలు ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీఈవో అబ్రహం, ఉపాధ్యాయ సంఘ నాయకులు

మరమ్మతుల ఊసే లేదు..!

- వర్షాధార చెరువులకు గడ్డు పరిస్థితి
- చింతలపూడి పెద్దచెరువుదీ అదే దుస్థితి
- ఆక్రమణల జోరు.. కుంచించుకుపోతున్న వైనం
- ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలుష్య కాసారం

చింతలపూడి, జూన్ 7: వర్షాకాలం ప్రారంభం కావడంతో చెరువుల కింద సేద్యం చేసే రైతులకు సాగు నీటి సమస్యల్లో భాగం గా పంట కాల్వలకు నీరువచ్చే తూములకు షట్టర్లను బాగు చేయక పోవడం వల్ల చెరువులకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. చింతలపూడి మండలంలో వరి సాగు అధికభాగం వర్షాధారమైన చెరువుల కింద సేద్యం సాగుతోంది. మండలంలో నీటిపారుదల శాఖకు చెందిన సాగునీటి చెరువులు 12 వరకు ఉన్నాయి. ఇవి చాలాభాగం అనుసంధానంలా ఒక చెరువు నిండితే, అదనపు నీరు దిగువ చెరువుకు చేరుతుంది. చెరువులు మరమ్మతులకు నోచుకోలేక ఒకపక్క ఉంటే, మరోపక్క పూడికలు పెరిగి, ఆక్రమణలకు గురై విస్తీర్ణం కుంచించుకుపోతున్నాయి. చింతలపూడి పెద్దచెరువులో బైపాస్ రోడ్డు వేసినా బ్యాక్‌వాటర్ రావడానికి వంతెనలు నిర్మించారు. అవి చెత్తతో పూడిక పోయాయి. దీంతో పక్కన ఉన్న కాలనీవాసులు కొందరు ఆక్రమణలు చేస్తున్నారు. మరోపక్క రియల్ ఎస్టేట్ దారి కోసం చెరువులోనే రోడ్డు వేశారు. దీనివల్ల వర్షం పడినప్పుడు బ్యాక్ వాటర్ చెరువులోకి రావడం లేదు. ఉన్నతాధికారులు పరిశీలించినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే చెరువు తూములు, షట్టర్లు పాడైపోయాయని, వాటికి తక్షణ మరమ్మతులు చేయకపోతే ఈ ఏడాది సాగునీరు నిల్వ ఉండే సామర్థ్యం తగ్గిపోయి సాగునీటి సమస్య ఏర్పడుతుందని చెరువు ఆయకట్టు సంఘం పెద్దలు చెబుతున్నారు. దీనిపై నీటి పారుదలశాఖ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఎటువంటి చర్యలు లేవన్నారు. చెరువు అదనపు నీరు వెళ్ళే స్లూయిస్ కూడా చెత్త, ప్లాస్టిక్‌తో నిండిపోయింది. ఈ చెరువు కింద అధికారికంగా 760 ఎకరాలు సాగవుతోంది. ఇదికాకుండా అనధికారికంగా కూడా సాగులో ఉంది. మరోవైపు ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకొచ్చి చెరువులో పోసేస్తున్నారని చెరువు కాలుష్యంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శెట్టివారిగూడెం వద్ద ఉన్న ఎర్రకాల్వ పుట్టుక అయిన మేడవైపు చెరువు తూములు బాగు చేయాలంటూ ఆయకట్టు రైతులు ఇటీవల అధికారులకు మొరపెట్టుకున్నా కనీసం కన్నెత్తి చూడలేదని ఆ చెరువు ఆయకట్టుదారుడు ఆది సత్యనారాయణ తెలిపారు.



పెద్ద చెరువులో ఆక్రమణలు



పాడైన పెద్దచెరువు తూము షట్టర్

కాలుష్యం బారిన చెరువు ..



చింతలపూడి పెద్దచెరువు కింద సేద్యం ఎక్కువ. ఇప్పుడు ఈ చెరువు ఆక్రమణల పర్వంతో పాటు చెత్తా చెదారం వేసి కాలుష్యం పెంచారు. ఒకప్పుడు మేమంతా ఈ చెరువులో నీరుతెచ్చి మంచినీరుగా వాడు కునే వాళ్ళం. ఇప్పుడు ఈ చెరువు వ్యర్థాలతో నిండి కాలుష్య కాసారంగా మారుతోంది. చెరువు తూములు మరమ్మతుల బారిన పడినా అధికారులు పట్టించుకోవడం లేదు.

- చిట్లూరి అంజిబాబు, ఆయకట్టు సంఘం, మాజీ అధ్యక్షుడు, చింతలపూడి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, జూన్ 7: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కేవీ.బుల్లికృష్ణ, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ రచన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్‌పై దృష్టి సారించాలన్నారు. ఇటుకల పరిశ్రమ, జీడి, చిన్నతరహా పరిశ్రమలు, దుకాణాలు తనిఖీచేసి బాల కార్మికులను గుర్తించాలన్నారు. చింతలపూడి, లింగపాలెం ప్రాంతాల్లో పొగాకు, హార్వెస్టింగ్ పనుల్లో తనిఖీ నిర్వహించాలని సూచించారు. జిల్లాలో చైల్డ్‌లేబర్ విజిలెన్స్ గ్రూపును ఏర్పాటు చేయాలని సూచించారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పై సమన్వయంతో పనిచేయాలి

మిషన్ వాత్సల్య అమలుకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లా బాలల సంక్షేమ, రక్షణ కమిటి చైర్మన్, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ నిరాదరణకు గురైన బాలలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి వంటి అవసరాలకు వాత్సల్య పథకంలో ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. ప్రతి బిడ్డకు ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యాన్ని అందించటమే ప్రధాన లక్ష్యమన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కేకేవి బుల్లికృష్ణ, బి.రచన, ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో మొబైల్ ఏటీఎం ప్రారంభం


మొబైల్ ఏటీఎం ప్రారంభిస్తున్న జేసీ

ఏలూరు కలెక్టరేట్, జూన్ 7: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, సెంట్రల్ ఆఫీస్ వద్ద మొబైల్ డిమానస్ట్రేషన్ వ్యాన్ (మొబైల్ ఏటీఎమ్)ను పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి శుక్రవారం ప్రారంభించారు. బ్యాంకు ఖాతాదారులు, రైతులు, ప్రజలకు ఏటీఎం వినియోగం, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కోసం మొబైల్ ఏటీఎం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రెండు మొబైల్ ఏటీఎంలకు అదనంగా ఈ వ్యాన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అనంతరం బ్యాంకుపర్సన్ ఇన్‌ఛార్జ్ కమిటీ సమావేశం జరిగింది. బ్యాంకు సీఈవో బి.శ్రీదేవి, నాబార్డు డీడీఎం పి.అనిల్‌కాంత్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పునాది అభ్యసనం'పై ముగిసిన శిక్షణ


మాట్లాడుతున్న ఏపీసీ సోమశేఖర్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 7: ప్రాథమిక విద్య బలోపేతానికి చేపట్టిన 'పునాది అభ్యసనం' కార్యక్రమంపై జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్లకు రెండురోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. సమగ్రశిక్ష ఏపీసీ బి.సోమశేఖర్ మాట్లాడుతూ ఒకటి, రెండో తరగతి బాలలు అక్షరాలు, పదాలు సులువుగా గు ర్తించడం ద్వారా వాక్యనిర్మాణం, అంకెలను గుర్తించడం, చతుర్విధ గణిత ప్రక్రియల పై ప్లే పద్ధతి ద్వారా బోధన శిక్షణ ఉద్దేశమన్నారు. బాలల్లో సంపూర్ణ అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించవచ్చునన్నారు. శిక్షణ పొందిన డీఆర్పీలు మండలాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఏఎంవో రెడ్డి రామారావు, రిసోర్స్ పర్సన్లు వెంకటరమణ, హరికృష్ణ, రాజాబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే రజకులకు మేలు


సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు రూరల్, జూన్ 7: రజకుల సమస్యలు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పరిష్కారమయ్యాయని, టీడీపీ ద్వారానే మేలు జరిగిందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంఘ సమావేశం జరిగింది. కూటమి అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో రజకుల ఇబ్బందులను కూటమి ప్రభుత్వం పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వం రజకుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దోబీఘాట్‌లు, చెరువుల పూడికతీత విషయంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. రజకుల చెరువుల లీజుల విషయంలో పంచాయతీ అధికారులు ప్రభుత్వ జీవోలను పక్కనపెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రజకుల చెరువులు కేటాయింపులు, లీజులు కేటాయింపులు నిర్ణయించాలని, చెరువులకు విద్యుత్ మోటారు కనెక్షన్ విషయంలో చొరవ చూపి ఉచిత విద్యుత్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విటాల శ్రీనివాస్, కె.మురళీ, చాటపర్రు శ్రీనివాసరావు, సుబ్బయ్య, శ్రీనివాసరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉమర్ అలీ మరణం పేదవర్గాలకు తీరని లోటు


ఉమర్ అలీకి నివాళులర్పిస్తున్న నాయకులు

బుట్టాయగూడెం, జూన్ 7: ఉమర్ అలీ మాస్టారు మృతి పేద వర్గాలకు తీరని లోటని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కెవి రమణ, వై.సూరిబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో శుక్రవారం మహమ్మద్ ఉమర్ అలీ సంతాప సభ జరిగింది. నాయకులు మాట్లాడుతూ అలీ మాస్టారు పేద విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు కొని ఇచ్చేవారన్నారు. ఎవరికి ఆపద వచ్చినా మాస్టారు పదిమందితో మాట్లాడి ఆర్థిక సహాయం తీసుకుని పేదవారికి సహాయం చేసేవారన్నారు. ఆయన అనారోగ్యంతో గత ఆదివారం మృతి చెందడం పేదలకు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో బాలు, జయ చండేశ్వరావు, కె.శ్రీను, వెంకట్, రమణారావు. జగన్, నవీన్, నరేష్ ప్రసాద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్పీ


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ

బుట్టాయగూడెం, జూన్ 7: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా టీమ్‌లను ఏర్పాటుచేసి శాంతిభద్రతలను అదుపులో ఉంచామన్నారు. పార్టీలు, నాయకులు మారుతుంటారని శాంతిభద్రతలకు మాత్రం విఘాతం కలిగించవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ పి.రాజేష్ ఎస్సైలు పాల్గొన్నారు.

హోంగార్డు కృష్ణ గణేశ్ సేవలు ప్రశంసనీయం

ఏలూరు క్రైం, జూన్ 7: ఏలూరు జిల్లా హోంగార్డు విభాగంలో పనిచేస్తున్న వి కృష్ణగణేశ్ (హెచ్‌జి 83) సేవలు ప్రశంసనీయమని ఎస్పీ మేరీ ప్రశాంతి కొనియాడారు. కృష్ణ గణేశ్ ఈనెల 3న ఉద్యోగ విరమణ చేశారు. నేపథ్యంలో ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ డీ మేరీ ప్రశాంతి అతనిని ఘనంగా దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేయించిన వైసీపీ సర్పంచ్‌లు?

దెందులూరు, జూన్ 7: టీడీపీ కూటమి విజయంతో శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నియోజకవర్గంలో కొందరు వైసీపీ సర్పంచ్‌లు సైతం టీడీపీకి అనుకూలంగా ఓటు వేయించారనే ప్రచారం జరుగుతోంది. సర్పంచ్‌లను టీ, బిస్కెట్‌కు పరిమితం చేశారని, ఎమ్మెల్యే కూడా చిన్నచూపు చూశారని వారిలో ఆగ్రహం నెలకొంది. వైసీపీ ప్రచారంలో పాల్గొంటూ, పోలింగ్ ముందు డబ్బు పంపిణీలో సైతం కీలకంగా వ్యవహరించిన నలుగురు సర్పంచ్‌లు కొందరు ఓటర్లతో టీడీపీకి ఓటు వేయించినట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ తరువాత వైసీపీ బలంగా ఉండే గ్రామాల్లో సైతం టీడీపీకి మెజార్టీ రావడం ఈ ప్రచారానికి బలం చేకూర్చుతోంది. కొంత మంది సర్పంచ్‌లుగా గెలిచి అప్పులు పాలయ్యామని, అందుకే టీడీపీ విజయం సాధించాలని కోరుకున్నట్లు చెబుతున్నారు.


కుక్కునూరులో టీడీపీ నాయకుల విజయోత్సవం


కొయ్యలగూడెంలో జనసేన, టీడీపీ నేతల సందడి


ఏలూరులో టీడీపీ నేతల విజయోత్సవం

టీడీపీ కూటమి విజయోత్సవం

పెదపాడు, జూన్ 7: ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో టీడీపీ శ్రేణుల్లో సంబరాల్లో మునిగి తేలుతున్నారు. అప్పనవీడులో టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవం నిర్వహించారు. వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులు అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం నుంచి జాతీయ రహదారిపై మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత బాణసంచా కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచి పెట్టారు. పెద్దసంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: చింతలపూడి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సొంగా రోషన్‌కుమార్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అశోక్‌నగర్‌లో జిల్లా పార్టీ క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా కూటమి అభ్యర్థులకు ఓట్లువేసి ఆదరించారన్నారు.

● కొయ్యలగూడెం: కూటమి విజయంతో సంబరాలు జరుపుకున్నారు. సౌభాగ్య థియేటర్ వద్ద డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. రాష్ట్ర ప్రజలంతా కూటమికి భారీ విజయం అందించారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మంచి పరిపాలన అందుతుందని ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుమర్తి రామకుమార్, తదితరులు ఉన్నారు.

● ఏలూరు రూరల్: ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన బడేటి చంటిని పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందించారు. జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజులపాటి గంగాధరరావు ఆధ్వర్యంలో చంటిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఏలూరు మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ, పలువురు ఉన్నతాధికారులు కలసి అభినందించారు.

ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అఖండ విజయం సాధించిన నేపథ్యంలో వీఆర్వోల సంఘ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఆర్ఐ ఆర్.శ్రీను నాయక్, వీఆర్వోలు జాన్, గోపి, తాడి వరప్రసాద్, సూర్యనారాయణ, ఆనంద్ తదితరులు ఉన్నారు.

● లింగపాలెం: తెలుగుదేశంపార్టీ విజయానికి కృషిచేసిన ప్రతిఒక్కరికి టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. అభివృద్ధివైపు ప్రజలు మొగ్గు చూపారన్నారు. తెలుగుదేశంపార్టీ విజయానికి కృషిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.


అప్పనవీడు జాతీయ రహదారిపై టీడీపీ శ్రేణుల మోటార్‌సైకిల్ ర్యాలీ

మోరంపూడి మల్లికార్జునరావు, ముసునూరి రాము, రాధాకృష్ణ, గారపాటి బుజ్జియ్య, మోరంపూడి ప్రసాద్, గుత్తా సత్యసాయివరప్రసాద్, పిల్లల శ్రీనివాస్, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, రాయంకుల చక్రధర్‌రావు, అసిలేటి అజయ్, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కుక్కునూరు: చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో తెలుగు తమ్ముళ్ల ఉత్సాహం రెట్టింపైంది. సీతారామనగరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ గణప శ్రీదేవి టీడీపీ జెండా ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి రావడానికి కష్టపడిన కార్యకర్తలందరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముప్పాల సాంబశివరావు, తాత వంశీ, ఎంపీటీసీ రమాదేవి, రాయి రమణయ్య పులి శ్రీను, తాత రామారావు, అఫీద్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో సందడి

ఉంగుటూరు: నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి అభిమానులు, కార్యకర్తలు ఉంగుటూరులోని జనసేన పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. కైకరం నుంచి మాజీ జడ్పీటీసీ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు నేతృత్వంలో అభిమానులు వచ్చి పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

డీఈవో అబ్రహం శుక్రవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో పాటు ఎంఈవో కె.శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఏలూరులో బీజేపీ కార్యాలయం వద్ద తపనా చౌదరి, నేతల సందడి


లింగపాలెంలో బీజేపీ శ్రేణుల సంబరాలు

ఎన్‌డిఏ నేతగా మోదీ ఎంపికపై హర్షం

ఏలూరు రూరల్, జూన్ 7: ఎన్‌డీఏ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, రాష్ట్ర ప్రజలు తమ పిల్లల భవిష్యత్‌కోసం ఎన్‌డీఏ కూటమికి ఓటువేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ కూటమి నేతగా నరేంద్ర మోదీని భాగస్వామ్య పక్షాలు ఎన్నుకున్న సందర్భంగా శుక్రవారం ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా గారపాటి సీతారామాంజనేయచౌదరి పాల్గొన్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మక తీర్పుతో దేశంలో వరుసగా మూడోసారి మోదీ ప్రధాని అవుతున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి గాలికొదిలేసిన ప్రభుత్వం బటన్ నొక్కుతూ ప్రచారం చేసుకుంటే ప్రజలు వేచి చూసి ఒక్కసారే తమ బిడ్డల భవిష్యత్‌కోసం ఎన్‌డీఏకు బటన్ నొక్కారన్నారు. కోడూరి లక్ష్మీనారాయణ, నడపన బాన భాస్కర్, గుమ్మడి చైతన్య, గాది రాంబాబు, నాగం శివ, కుసుమ, కామేష్ పాల్గొన్నారు.

● లింగపాలెం: దేశంలో ఎన్‌డీఏ కూటమి మూడోసారి అధికారంలోకి రావడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయడం ఎంతో గొప్ప విషయమని రాయంకుల చక్రధర్‌రావు అన్నారు. మఠంగూడెంలో బీజేపీ, టీడీపీ, జనసేన శ్రేణులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్‌డియే కూటమి విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. చంద్రబాబునాయుడు గొప్ప విజన్ ఉన్న నాయకుడు అన్నారు. పవన్‌కల్యాణ్ కూటమి గెలుపుకోసం ఎంతో కృషిచేశారని, కూటమి గెలుపు పవన్‌కల్యాణ్‌కే అంకితం అన్నారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. కొత్త ప్రభుత్వాలకు తన శుభాకాంక్షలను తెలియచేశారు. కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, టీడీపీ నాయకులు జాస్తి శ్రీనివాసరావు, నందేటి మురళీ, ఘంటా నాగరాజేంద్ర, చౌటపల్లి విజయశ్రీను, పలువురు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి విజయంతో అమ్మవారికి మొక్కు చెల్లింపు


ఆలయంలో మొక్కు తీర్చుకున్న నేతలు

దెందులూరు, జూన్ 7: కొవ్వలి గ్రామ దేవత గంగానమ్మ, కనకదుర్గ అమ్మవార్లకు టీడీపీ నేతలు శుక్రవారం 116 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడంతో కొవ్వలి టీడీపీ నేతలు గంగనమ్మకు మొక్కు చెల్లించుకున్నారు. వెలమటి అనిల్, గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా చింతమనేని ప్రభాకర్ ఎంపీ మహేష్ యాదవ్ గెలవాలని కోరుకున్నారు. వారు విజయం సాధించడంతో టీడీపీ నేతలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అమ్మవార్లకు 116 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలకు 159మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 7 : ఓపెన్ స్కూల్స్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షల్లో శుక్రవారం పదో తరగతి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పరీక్షకు 453 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ భౌతికశాస్త్రం పరీక్షకు 306మంది, రాజనీతిశాస్త్రం పరీక్షకు 181మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు. 159మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఆదర్శ దంపతుల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 7: వరకట్న వ్యతిరేక వర్ణాంతర ఆదర్శ వివాహాలను ప్రోత్సహించే క్రమంలో భాగంగా అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారం ఇవ్వనున్నారు. కులాంతర, మతాంతర వివాహం చేసుకున్న 60 జంటలను ఎంపిక చేసి జూలై 14న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సత్కరిస్తామని ఆల్ ది బెస్ట్ అకాడమీ నిర్వాహకులు ఇ.సూర్యసుధ, ఇ.స్మృతి సూర్యవంశీ, ఇ.సూర్యతేజ సుబ్రాంత్ శుక్రవారం తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలనుంచి ఆదర్శ దంపతులకు పురస్కారాలు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు సత్కారం చేస్తామన్నారు. ఆదర్శ జంటలు ఈ నెల 15లోపు వాట్సాప్ నెంబరు 96523 47207కు వివరాలు పంపాలన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు ఈ నెల 10 వరకు గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 7: జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు, వెరిఫికేషన్ చేసుకునే గడువు ఈ నెల 10న ముగుస్తుందని సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కౌన్సెలింగ్ కన్వీనర్ పి.రజిత శుక్రవారం తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో సెలవు అయినప్పటికీ దరఖాస్తులు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అర్హులని స్పష్టం చేసారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్‌నెంబరు 08812-230269లో సంప్రదించాలన్నారు.






ఏలూరులోని బాలల గ్రంథాలయం, పెదవేగి, ధర్మాజిగూడెం గ్రంథాలయాల్లో విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 7: వేసవి సెలవుల సందర్భంగా నగరంలోని వన్ టౌన్ బాలల గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. బాలలకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పీఎస్.లక్ష్మి, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ మాట్లాడుతూ 20 రోజులుగా నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. ప్రతీ ఆదివారం నిర్వహించే చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనవచ్చన్నారు. చెన్నా వెంకట్రామయ్య, సంగీతం టీచర్ గంగాభవాని, రిసోర్స్‌పర్సన్లు నళిని, పవన్‌కుమార్, శ్రావణికుమారి, అనురాధ, లైబ్రరీ సిబ్బంది కీర్తి తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు కలెక్టరేట్: ఏలూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. చీర్ల పద్మశ్రీ, సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు మాట్లాడారు. వివిధ అంశాలపై చిన్నారులకు శిక్షణ ఇచ్చిన రీసోర్స్‌పర్సన్‌లను అందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: గ్రంథపఠనంతో వ్యక్తి జీవన విధానంలో గణనీయమైన మార్పును తీసుకువస్తుందని సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి అన్నారు. శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. మంచి పుస్తకాన్ని ఎప్పుడూ వెంట ఉంచుకుంటే అంతకంటే ఆరోగ్యం మరొకటి ఉండదని, ప్రతి ఒక్కరూ గ్రంథపఠనం చేయాలని ఆయన సూచించారు. నిత్యం పాఠశాల ముగిసిన తరువాత కొద్దిసేపైనా గ్రంథాలయంలో గడపాలని, అదే విజ్ఞానాన్ని పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్, విశ్రాంత ఉద్యోగి కంచెన మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● లింగపాలెం: విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయాలను సందర్శించాలని గ్రంథాలయాధికారి సీహెచ్.వెంకటరమణ అన్నారు. ధర్మాజిగూడెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో బీఎస్‌వీఎస్.ప్రకాశరావు, కందుల చిట్టియ్య, బాలవెంకట సుబ్బారావు మాట్లాడారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలను సందర్శించాలన్నారు. పేపర్‌క్రాఫ్ట్, డ్రాయింగ్, ఆటల పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు. రిసోర్స్‌పర్సన్స్ ఎం.జ్యోతిప్రియాంక, ఏవీ నారాయణ, పలువురు విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంచనాలకు మించి సేవలందిస్తా : బడేటి


ఆత్మీయ సమావేశంలో బడేటి చంటి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 7: ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని తనకు అఖండ విజయాన్ని చేకూర్చారని, వారి ఆశయాలకు అనుగుణంగా అంచనాలకు మించి సేవలు అందిస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. టుబాకో మర్చంట్ అసోసియేషన్ హాలులో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యమని చెప్పారు. ప్రజలు, అధికారులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, దాసరి ఆంజనేయులు, రాఘవయ్యచౌదరి, సిరిపల్లి ప్రసాద్, నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, బొత్స మధు, నాగులపాటి గంగాధరరావు, నాగం శివల, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ విజయం అందరిదీ : చింతమనేని


చింతమనేనిని అభినందిస్తున్న ప్రజానీకం

పెదవేగి, జూన్ 7: ఈ విజయం మీ అందరిదీ, మీరిచ్చిన అధికారాన్ని మీకే అంకితమిస్తున్నానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన చింతమనేనిని నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సత్కరించారు. టీడీపీ కూటమి గెలుపుతో స్వేచ్ఛావాయులు పీల్చుకున్నారన్నారు. దాడులు, దౌర్జన్యాలతో పాలన సాగించిన వైసీపీకి ప్రజలు కోలుకోలేని రీతిలో గట్టి షాక్ ఇచ్చారని, ప్రజలు కొట్టిన ఈ దెబ్బతో ఆ పార్టీ నామరూపాలు లేకుండా పోయిందని ప్రభాకర్ అన్నారు.

ఉద్యోగులు ప్రజాహితమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చింతమనేనిని శుక్రవారం కలిసిన ఉద్యోగులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో సుపరిపాలన

ఎమ్మెల్యే మద్దిపాటి


విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, జూన్ 7: కేంద్రం, ఇటు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిను డబుల్ ఇంజన్ సర్కార్‌గా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. టీడీపీ విజయోత్సవ ర్యాలీని ఆయన శుక్రవారం ద్వారకాతిరుమల చిన వెంకన్న సన్నిధి నుంచి ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో త్రినాథరావు ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన ద్వారకాతిరుమల, రామన్నగూడెం, వెంకటకృష్ణాపురం, గుండుగొలనుకుంట, దొరసానిపాడు, జి.కొత్తపల్లి, పోతేపల్లి, సూర్యచంద్రరావుపేట, పంగిడిగూడెం, తదితర గ్రామాల్లో పర్యటించారు. జి.కొత్తపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ప్రజల మనోభావాలను తెలిపాయన్నారు. సంక్షేమ, పారదర్శక పాలన అందించనున్నామని, గోపాలపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్టు ప్రకటించారు. లంకా సత్యనారాయణ, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మద్రాసు రాము, మొగతడకల శ్రీనివాసరావు, డీవీఎస్ చౌదరి, పోలిన శ్రీనివాసరావు, సుంకవల్లి బ్రహ్మయ్య, మొగతడకల ఓంప్రకాశ్‌చౌదరి, నాదెళ్ల వేణు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుని సేవలో ఎంపీ పుట్టా మహేష్


పూజలు చేస్తున్న ఎంపీ పుట్టా మహేష్

ఏలూరు కార్పొరేషన్, జూన్ 7: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో మర్రి అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఈనెల 1న ప్రారంభమైన హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటరత్నం శర్మ ఎంపీ మహేష్‌తో పూజలు చేయించారు.

జనసేన నేత అప్పలనాయుడికి సత్కారం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధించిన నేపథ్యంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజా సంఘాల నాయకులు, రేషన్ డీలర్లు, వీఆర్వోలు జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అప్పలనాయుడుకు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. ఈ మేరకు ఆయన నివాస గృహం వద్ద సందడి నెలకొంది.

● లోకేశ్‌ను కలసిన నేతలు





మంగళగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం పలువురు నేతలు కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, పారేపల్లి నరేష్, మల్లిపూడి నవీన్, తాళ్ళూరి వెంకటేశ్వరావు, ఓగిరాల కుమార్, చిటికిన శ్రీను, పి.విజయ్ దేవి ప్రసాద్ తదితరులు లోకేశ్‌ను కలిశారు.

- ఏలూరు / బుట్టాయగూడెం

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు ఎడ్యుకేషన్ :** నగరంలోని గవరవరం చెరువుగట్టు ప్రాంతంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, ఆరోగ్య సిబ్బంది నాగమణి, శ్రీనివాసరావు, రమేష్, అయ్యప్ప, శాంతి, వసంత పాల్గొన్నారు.
- కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుచేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు, అధ్యాపకులు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు.
- **కుక్కునూరు :** ఎన్నోఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఆదివాసీల భూములకు పట్టాలివ్వాలని సీపీఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంద డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కే.గౌస్ అన్నారు. ఆదివాసి రైతాంగంతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పట్టాలు లేకపోవడం అటవీశాఖాధికారుల బెదిరింపులు రైతాంగానికి ఎక్కువయ్యాయని ఆరోపించారు.
- **పోలవరం :** విద్యుత్ లైన్ల పునరుద్ధరణ చర్యలు వేగవంతం చేస్తున్నామని విద్యుత్ శాఖ డీఈ పి.రాధాకృష్ణ అన్నారు. తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో నేలకూలిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలు వేసే పనులను పరిశీలించారు.
- **ద్వారకా తిరుమల :** శ్రీవారి ఆలయాన్ని ఏఎస్పీ స్వరూపరాణి శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఆమెకు ఘనస్వాగతం లభించింది. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరుపుకోగా అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.
- **భీమడోలు :** భీమడోలులో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా ఉక్కపోతక, ఎండతో ఇబ్బందిపడ్డ ప్రజలు సేదతీరారు. సాయంత్రం 6 గంటల నుంచి అర గంట పాటు కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.
- **పెదపాడు :** వ్యక్తిగత కారణాలతో త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు గోగుంట సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ భావరాజు సత్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన రాజీనామా లేఖను ఉన్నతాధికారులకు పంపామన్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు రాజీనామా లేఖలు పంపినట్లు తెలిపారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీవోల సంఘం నాయకులు

ఎన్నికల కోడ్ ఉల్లంఘనతో సస్పెండైన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి


ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 7 : ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా వివిధ కారణాలతో జిల్లాలో ఇటీవల సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిపై సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని శుక్రవారం ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రామారావు తదితరులు కలుసుకుని వినతిపత్రం అందజేశారు. దీనిపై త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారని ఎన్జీవో నేతలు వివరించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేసినందుకు కలెక్టర్‌ను అభినందిస్తూ పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఎన్జీవోల సంఘ ఏలూరు తాలూకా అధ్యక్షుడు జి.శ్రీధర్‌రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న దినేష్ శంకర్‌రెడ్డి తదితరులు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 7 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై 8,9,10 తరగతుల విద్యార్థులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సెలవులలో సైతం ఇక్కడకు వచ్చి త్రీడి ప్రింటింగ్ నేర్చుకోవడం అభినంద నీయమన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే పాఠ్యాం శాలపై పట్టు సాధించడంతో పాటూ నిత్యం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చు కోవడం బాల్యం నుంచి అలవాటు చేసుకోవాలన్నారు. శిక్షణ తీసుకున్న 44 మంది విద్యార్థులకు ప్రశంశా పత్రాలను అందజేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టీ.బాబూరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కార్తికేయ శర్మ, ఆచార్యులు డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.



నివేదిక అందిస్తున్న ఉప కులపతి జానకిరామ్

జీడిమామిడి పంటపై పరిశోధన నివేదిక

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 7: జీడిమామిడి పంటపై ఐదేళ్లపాటు దేశ వ్యాప్తంగా చేసిన పరిశోధనల నివేదికను (క్యూఆర్టీ)ని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి, జీడిమామిడి పరిశోధనల సమీక్ష కమిటీ ఛైర్మన్ డాక్టర్ టి.జానకీరామ్ న్యూ ఢిల్లిలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాథక్‌కు శుక్రవారం సమర్పించారు. ఈ నివేదికలో జీడిమామిడి పంట జాతీయ సగటు హెక్టారుకు 750 కేజిల దిగుబడి ఉండగా రాష్ట్రంలో హెక్టారుకు 2 వేల కేజీలు సాధించేలా చూడటం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, తదితర అంశాలు పొందుపర్చినట్టు జానకిరామ్ వివరించారు.

నేడు విజయవాడలో రేషన్ డీలర్ల సంఘ సమావేశం

ఉండి, జూన్ 7: రాష్ట్ర రేషన్ డీలర్ల సమావేశం విజయవంతం చేయాలని ఉండి మండలం రేషన్ డీలర్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెన్నంశెట్టి బాబి, గాదిరాజు రామాంజనేయరాజులు కోరారు. శుక్రవారం ఉండిలో ఈ మేరకు పత్రికలకు వివరాలను అందించారు. విజయవాడలోని వంగవీటి మోహనరంగా ఇంటి పక్కన వున్న మాకినేని బసవపున్నయ్య విజ్ఞానభవన్‌లో (కమ్యూనిస్ట్ ఆఫీసు) శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. డీలర్లు, సంఘనాయకులు హాజరుకావాలని కోరారు. నూతన ప్రభుత్వం ముందుకు తమ సమస్యలను తీసుకుని వెళ్లి చర్చించి పరిష్కరించుకోనున్నట్లు తెలిపారు. మండల డీలర్లు మురళీకృష్ణంరాజు,కొమ్మన నాగబాబు,లక్ష్మణ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

నేటి నుంచి మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర

భీమవరంటౌన్, జూన్ 7 : మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర ఉత్సవాలు ఈనెల 8 వతేదీ నుంచి వచ్చేనెల 5 వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్దామహాలక్ష్మి గణేష్ తెలిపారు. శనివారం సాయంత్రం 5-25 నిమిషాలకు ఆలయంలో అమ్మవారిని నెలబెడతారన్నారు. పూజల అనంతరం మంగళవాయిద్యాలతో అమ్మవారి గరగలను ఊరేగింపుగా గరగల గుడి వద్దకు తీసుకు వెళ్లి అక్కడ ఉంచుతారని తెలిపారు.21 నుంచి 29 వరకు అమ్మవారు గ్రామంలో పర్యటించి భక్తుల నుంచి పానకాలను స్వీకరిస్తారన్నారు. 13వ తేదిన గవళ్ళ గుడుపు, 20న అమ్మవారికి నైవేద్యాలు,దేవస్థానం ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తామన్నారు. 27వ తేదీన నీరుల్లి కూరగాయ పండ్లవర్తక సంఘం, దేవస్థానం, మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ అధ్వర్యంలో సాయంత్రం జాతర నిర్వహిస్తామన్నారు. వచ్చేనెల 3న అమ్మవారికి నైవేద్యాలు, దేవస్థానం ఆధ్వ ర్యంలో రాత్రిసేవ నిర్వహించి 4వ తేదీ తెల్లవారుజామున ఉదయం 5-30 నిమిషాలకు ఆలయంలో అమ్మవారికి ఊయ్యాల సేవ నిర్వహించి గరగలను మూల విరాట్ వద్ద ఉంచటంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.



ముసునూరులో నేలకు ఒరిగిన అరటిపంట

అరటి రైతులకు అపార నష్టం

ముసునూరు, జూన్ 7: ముసునూరు మండలంలో మూడు గ్రామాల్లో వీచిన ఈదురుగాలుల బీభత్సానికి అరటి పంట తీవ్రంగా దెబ్బతింది. పంట చేతికి వచ్చి గెలలు నరికే సమయంలో పంట నేలపాలై ఆర్థికంగా రైతులకు నష్టపోయారు. ముసునూరులో సూమారు 100 ఎకరాలపైగా అరటిపంట దెబ్బతింది. ముసునూరుకు చెందిన కౌలు రైతు చింతా సూరిబాబు సాగుచేసిన 5 ఎకరాల అరటిపంట గెల దశలో ఉండగా ఈదురుగాలులకు పూర్తిగా నేలకు ఒరిగిపోయింది. సూమారు రూ. 5 లక్షలు నష్టమని రైతు వాపోయాడు. అలాగే మరో కౌలురైతు కొత్త విజయకుమార్‌కు చెందిన ఐదు ఎకరాల పంట తీవ్రంగా దెబ్బతినడంతో కౌలుతో కలిపి రూ. 10 లక్షలు నష్టం వాల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతులు కొప్పుల శ్రీనివాస రావు, తుల్లిమెల్లి రంగరావు, మానికల కొండలుతోపాటు మరికొంతమంది రైతుల అరటిపంట నేలకొరగడంతో నష్టపోయారు. చింతలవల్లి, గోగులంపాడు గ్రామాల్లో సైతం ఈదురుగాలులకు అరటిపంట నేలమట్టం అయింది. నోటిదగ్గరకు వచ్చిన పంట ప్రకృతి వైపరీత్యానికి నేలపాలైవడంతో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

హృదయం.. పదిలమేనా ?



- చిన్న వయసులోనే గుండెపోటు
- కొవిడ్ తరువాత పెరిగిన కేసులు
- ఆందోళన కలిగిస్తున్న మరణాలు
- అలవాట్లే కొంప ముంచుతున్నాయి
- తగిన జాగ్రత్తలతో ఆరోగ్యం




పాలకొల్లు, జూన్ 7: పసి ప్రాయం మొదలుకొని నడి వయసు, వృద్ధాప్యం ఇలా వయోబేధం లేకుండా గుండెపోటు అన్ని వయసుల వారిని కబలించి వేస్తున్నది. ఇటీవల కాలంలో ప్రతీ పది మరణాలల్లో కనీసం రెండు గుండె పోటు మరణాలు కనిపిస్తున్నాయి. కొవిడ్ తరువాత గుండె పోటు మృతుల సంఖ్య పెరిగినట్లు పలు అధ్యయనాల్లో తేలింది.ఆకస్మికంగా వచ్చే గుండె పోటు మరణాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకోవడం, కనుమూయడం జరుగుతుంది.

నిద్రలోనే గుండెపోటు

ఐసీఎంఆర్ అధ్యయనం ప్రకారం తీవ్రమైన కొవిడ్ బారిన పడిన వారు ఇటీవల గుండెపోటుకు గురవుతున్నారు. కొవిడ్‌బారిన పడిన వారు పరుగెత్తడం, అధిక వ్యాయామానికి దూరంగా ఉండటం, అధిక శ్రమతో కూడిన పనులు జోలికి వెళ్లకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. కొవిడ్ బారిన పడినవారు రెండుమూడు సంవత్సరాలు పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గుండెపోటుకు దూరంగా ఉండవచ్చునని చెబుతున్నారు. మారిన ఆహార అలవాట్లు కారణంగా గుండె పోటుకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో పలువురు నిద్రిస్తున్న సమయంలోనే గుండె పోటుకు గురవుతున్నారు. తెలియకుండానే ప్రాణాలు వదులుతున్నారు. ఇది సర్వత్రా ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రముఖ కన్నడ నటుడు ఒకరు నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందారు.

మారిన అలవాట్లతోనే ఇబ్బందులు



రెండు దశాబ్దాలకు ముందు 45 సంవత్సరాల వయసు లోపు పది శాతం మాత్రమే మాత్రం గుండె పోటు కనిపించేది. 40 సంవత్సరాలు పైబడిన వారిలో అధికంగా గుండెపోటు మరణాలు కనిపించేవి. ఇపుడు హైస్కూలు విద్యార్థుల స్థాయి నుంచి అన్ని వయసుల వారిని గుండెపోటు వదలడం లేదు. దీనికి ప్రధాన కారణం డయాబెటిక్, హైపర్ టెన్షన్ ఊబకాయంగా పేర్కొంటున్నారు. గుండెలో రక్తం గడ్డ కడితే గుండె పోటుకు గురవుతారు. ప్రాథమికంగా కళ్లకు చీకట్లు రావడం, తల తిరగడం, శ్వాసలో ఇబ్బందులు చాతీ నొప్పి ప్రధానంగా గుండె పోటు లక్షణాల్లో కనిపిస్తాయి. మారిన ఆహా రపు అలవాట్లు కలుషిత ఆహారం, సమయ పాలన లేకపోడం, పని ఒత్తిడి, మానసిక ఆందోళన, ఆర్థిక ఇబ్బందులు, కిడ్నీ సమస్యలు ఇంకా పలు ఇతర సమస్యలతో పాటు వంశ పారంపర్యంగానూ గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయి.

ప్రధాన కారణాలు

అధికంగా చెక్కర, కొవ్వు పదార్థాలు ఉన్న ఆహారం వల్ల రక్త నాళాలు మూసుకుపోతాయి. ఆ సమయంలో గుండెకు ఆక్సిన్ అందక గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కొవ్వు అధికంగా ఉండే పాస్ట్ ఫుడ్ అధికంగా తినడం, వ్యాయామం చేయకపోవడం, పొగ తాగడం, మద్యం సేవించడం, ఆలోచనలతో ఒత్తిడికి గురి కావడం, కొవ్వు శాతం అధికంగా ఉండటం, రక్త పోటు, మధుమేహం ప్రధాన కారణాలు.

ప్రధాన పరీక్షలు

చాతిలో నొప్పి ఉన్నటువంటి వ్యక్తులు ముందుగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలి. అందులో ఏ విధమైన తేడా కనిపించినట్లైతే 2డీ ఎకో, టీఎంటీ యాంజియోగ్రామ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా లక్షణాలు తెలుస్తాయి. ఇటీవల కాలంలో గుండెపోటుతో ప్రముఖ వైద్యులు సైతం మృత్యువాత పడు తున్నారు. రెండు రోజులు క్రితం విధి నిర్వహణలో ఉన్న పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గుండెపోటుతో మరణించారు.మొన్నటికి మొన్న ఉండిలో ఒక ఉపాధ్యాయుడు గుండె పోటుకు గురై ప్రాణాలు వదిలారు. సుమారు మూడు నెలలు క్రితం విజయవాడలోని ప్రముఖ హార్ట్ సర్జన్ గుండెపోటుతో తనువు చాలించారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

రోజూ కనీసం అరగంట వ్యాయామం చేయాలి. పురుషులు 40 సంవత్సరాలు, మహిళలు 50 సంవత్సరాలు తరువాత గుండె పనితీరును క్రమంగా చెక్ చేయించుకోవాలి.జంక్ ఫుడ్, దూమ,మద్యపానాలకు దూరంగా ఉండాలి. రోజుకు 8 గంటలు నిద్ర అవసరం. మధ్యాహ్నం వేళ నిద్ర గుండె, మెదడు పనితీరు మెరుగు పరుస్తుంది. యోగా వల్ల గుండెకు ఒత్తిడి తగ్గుతుంది.

> భుజం నుంచి ఎడమ చేతి కిందివరకు తీవ్రంగా నొప్పి వస్తే గుండె పోటుకు తొలి సంకేతంగా భావించాలి. శ్వాస ఇబ్బందులు, అధికంగా చెమటలు పట్టడం,అలసట ఉంటే డాక్టర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.
>
> ప్రతీ ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సీపీఆర్ (కార్డియో పల్మరీ రిసర్స్ టేషన్) చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. స్ట్రోక్‌కు గురైన వ్యక్తుల ఛాతీపై 30 నుంచి 40 సార్లు గట్టిగా ఒత్తడం, నోటిలోకి గాలి ఊదడం ద్వారా ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చు.
>
> ఇటీవల కాలంలో భారతీయులలో గుండె బలం క్షీణిస్తుండంతో మరణాలు పెరుగుతున్నాయి. 2015 లెక్కలు ప్రకారం దేశంలో 6.5 కోట్ల మంది గుండెజబ్బుతో బాధపడుతున్నారు. వారిలో 2.5 కోట్ల మంది 40 సంవత్సరాలు లోపు వారే.

నిద్రలేమి ప్రధాన కారణం



ఇటీవల కాలంలో యువత అర్ధరాత్రి వరకు మేల్కొని ఉంటున్నారు. నిద్రలేమి కారణంగానూ గుండెపోటు సంభవిస్తుంది. ముఖ్యంగా ఆహారపు అల వాట్లు మార్చుకోవాలి. వ్యాయామం చేయాలి. కనీసం 8 గంటలు నిద్రపోవాలి. నిద్ర లేమి కారణంగా బీపీ వచ్చి తదనంతరం అది దీర్ఘకాలికంగా మారి గుండెపోటుకు గురయ్యే అవకాశం ఉంది. తగిన ఆహారపు అలవాట్లు , వ్యాయామం, మానసిక ప్రశాంతతోనే గుండెపోటును నివారించవచ్చు. ఇటీవల వీడీ వెంట్రిక్యులర్ మరణాలు ఎక్కువ అవుతున్నాయి.

-డాక్టర్ యజ్ఞవర్మ, ఎండీ, పాలకొల్లు

స్ట్రీట్ ఫుడ్ జోలికి వెళ్ళవద్దు



ఇటీవల కాలంలో ఇంటిపట్టున ఉండి ఆహారం తీసుకునేవారి సంఖ్య తగ్గింది. అధిక శాతం కలుషిత ఆహారం వల్ల శరీరంలోని వివిధ బాగాల పనితీరు మారుతున్నది. దీంతో గుండె పోటుతో పాటు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. వంశ పారంపర్యంగా కొందరు గుండెపోటుకు గురైతే వ్యాయామం, నడక లేకపోవడం,శక్తికి మించి ఆలోచన చేయడం, స్ట్రెస్ తదితర కారణాలు గుండెపోటుకు గురి చేస్తున్నాయి. ఇటీవల పిల్లలు కూడా గుండెపోటుకు గురవడానికి కారణం వ్యాయామం లేకపోవడమే. పాఠశాలలో క్రీడా మైదానాలు ఉండడం లేదు. దీంతో పిల్లల్లో ఊబకాయం పెరగడంతో గుండె పోటు సంభవిస్తుంది.

- డాక్టర్ శిరిచందన, డీఎన్‌పీ జనరల్ మెడిసిన్

మా జిల్లాకు పంపేయండి



- పోలీస్ శాఖలో బదిలీల కోసం ఎస్ఐ, సీఐలు ఎదురు చూపులు
- ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ
- కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు
- మళ్లీ తమ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నాలు
- నూతన ప్రజా ప్రతినిధులతో సిఫారసులు

ఏలూరు క్రైం, జూన్ 7 : సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. కూటమి జైకేతనం ఎగురవేసింది. ఇప్పటికే ఐఎఎస్, ఐపీఎస్‌ల బదిలీలు ప్రారంభం అయ్యాయి. ఎన్నికలకు ముందు ఒకే జిల్లాలో మూడేళ్ల పనిచేసిన సీఐ, ఎస్ఐలను వేరే జిల్లాలకు బదిలీ చేయాలని అప్పటి ఉన్నతాధికారుల ఆదేశాలు ఉండడంతో ఏలూరు రేంజ్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలను బదిలీ చేశారు. మార్చి 16 నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈనెల 6వ తేదీ సాయంత్రం ఎన్నికల కోడ్ ఎత్తివేశారు. ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలో పక్క జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎస్ఐ, సీఐలు అక్కడ ఒంటరిగా రూమ్ తీసుకుని విధులను నిర్వర్తిస్తూ కుటుంబాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో తమ కుటుంబ సభ్యులు ఉంటున్న జిల్లాలకు బదిలీ చేయించుకోవడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది ఎస్ఐలు, సీఐలు శుక్రవారం ఏలూరు నగరానికి వచ్చి రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ గోడు వినిపించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడిన వెంటనే బదిలీలు జరుపుతామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ లోపు నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో సిఫార్సులు చేయించుకోవడానికి ఇప్పటికే తమ బంధువుల ద్వారానో, స్నేహితుల ద్వారానో కొంత మంది ఎస్ఐలు, సీఐలు రంగంలోకి దిగారు. వైసీపీ ప్రభుత్వంలో లైప్ లైన్‌గా వెళ్లిపోయిన వారంతా ఇప్పుడు బయటకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు చెప్పుకుంటున్నట్లు సమా చారం. ఈసారి అయినా మంచి పోస్టులు పొందాలని వారు ఇప్పటికే సిఫార్సులు చేస్తున్నారు. తాము సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తామని మంచి పేరు తీసుకువస్తామని ప్రజా ప్రతినిధులకు కొంత మంది హామీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ ముగియడంతో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ఇళ్లకు ఇప్పటి వివిధ శాఖల అధికారులు వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు చెప్తున్నారు. పనిలో పనిగా వారి మనసులో మాట చెప్పేసి హామీ పొందేస్తున్నారు. రాష్ట్రంలో కౌంటింగ్ ముగిసిన తరువాత కొన్ని ప్రాంతాల్లో ఇంకా అలజడులు, అల్లర్లు ఉంటున్న నేపథ్యంలో బదిలీలు కాస్త ఆలస్యం అవ్వవచ్చునని తెలుస్తోంది. అయితే ఈనెల 20 తరువాత పోలీస్ శాఖలో బదిలీలకు శ్రీకారం చుట్టి జులై మొదటి తేదీకి పూర్తి చేయ డానికి రంగం సిద్ధమైనట్లు సమాచారం. అంతేకాకుండా ఆగస్టు నాటికి పదో న్నతులు కూడా కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. డీఎస్పీ నుంచి ఎస్ఐ, సీఐలు ప్రస్తుతం తాము ఆశిస్తున్న ప్రాంతంలో పని చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు బదిలీలపై వచ్చిన అధికారులు తమ ప్రాంతానికి ఎప్పుడు వెళ్లిపోతామా అని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. మొత్తం మీద పదిరోజుల్లో బదిలీలకు తెర లేపుతారని తెలుస్తోంది.



శ్రీవారి శేషాచలంపై ఉన్న దేవస్థానం టోల్‌గేట్

ద్వారకా తిరుమల టోల్‌గేట్ వేలం ఏడాదికి రూ.1.37 కోట్లు

ద్వారకా తిరుమల, జూన్ 7: శ్రీవారి దేవస్థానం టోల్‌గేట్ నిర్వహణకు జరిగిన బహిరంగ వేలంపాటలో స్వామివారికి ఏడాదికి రూ. 1.37 కోట్లు ఆదాయం సమకూరింది. పాతకల్యాణ మండప ఆవరణలో శుక్రవారం టోల్ నిర్వహణ కోసం బహిరంగ వేలం జరిగింది. ఇందులో ఐదుగురు పాటదార్లు డిపాజిట్లు కట్టగా ఇద్దరే పోటీలో ఉన్నారు. అయితే వేలంలో పాల్గొన్న పాటదారులు రూ.1.32 కోట్లతో నిలిచిపోవడంతో టెండర్ బాక్స్‌ను దేవస్థానం ఓపెన్ చేసింది. అప్పగించిన నాటి నుంచి రెండేళ్ల కాలానికి గాను మొదటి ఏడాది రూ. కోటీ 37 లక్షల 09 వేల 999 లకు నల్లజర్లకు చెందిన ఉప్పులూరి రేణుకాదేవి టెంటర్ వేసి హక్కును దక్కించుకున్నారు. రెండో ఏడాది దీనిమీద 10 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఐదు నెలలుగా దేవస్థానమే నిర్వహణ

మరో ఏడాది కాలం గడువు ఉండగానే టోల్‌గేట్ నిర్వహణ నిబంధనలను తుంగలోకి తొక్కి గీ కాంట్రాక్టర్ మొదటి ఏడాది నష్టం వచ్చిందని చెబుతూ ఈఏడాది జనవరి 31న మధ్యలోనే వదిలివేశాడు. రెండేళ్ల కాలానికి జరిగిన వేలంపాటలో కె.శ్రీనివాసరావు అనే కాంట్రాక్టర్ ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలకు రుసుము వసూలు చేసుకునే హక్కును ఏడాదికి రూ.1.70 కోట్లకు కైవసం చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం రెండో ఏడు 10 శాతం మేర పెంచి, మొదటి ఏడాది పూర్తి కావడానికి మూడు నెలల ముందే రెండో ఏడుకు సంబంధించి నగదు మొత్తాన్ని దేవస్థానానికి చెల్లించాల్సి ఉంది. టోల్‌గేట్ నిర్వహణలో ఉన్న జీఎస్టీ కారణంగా నష్టపోతున్నానని ఇకపై నిర్వహణ సాధ్యం కాదని. తనిచ్చిన డిపాజిట్ సొమ్ము రూ.10 లక్షలు చెల్లించాలని దేవస్థానానికి అర్జీ పెట్టుకుని తప్పుకున్నాడు. దీంతో దేవస్థానమే ఫిబ్రవరి 1 నుంచి టోల్‌గేట్‌ను నిర్వహిస్తోంది. ఇప్పుడు తాజాగా వేలంపాట నిర్వహించడంతో టెండర్ ద్వారా హెచ్చు పాటదారునికి అవకాశం కల్పించనున్నారు.

క్రైం కార్నర్

బైక్‌లు ఢీ..ఇద్దరు యువకులు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, జూన్ 7 : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం పట్టణానికి చెందిన పెనుగొండ శ్రీను (37) డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి శ్రీను, అతని స్నేహితుడు వీరవల్లి శ్రీనివాస్‌లు (30) ద్విచక్ర వాహనంపై భీమవరం నుంచి చినరంగనిపాలెం వైపు వస్తుండగా విస్సాకోడేరు వైపు నుంచి భీమవరం వైపు యమహా వాహనంపై వస్తున్న వ్యక్తి వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. దీంతో పెనుగొండ శ్రీను, వీరవల్లి శ్రీనివాస్‌ల తలకు తీవ్ర గాయాలవడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అవతలి వ్యక్తి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. పెనుగొండ శ్రీను భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలకు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు తెలిపారు.

చెరువు గట్టు వివాదం..ఒకరిపై ఒకరు ఫిర్యాదు

ఆకివీడు, జూన్ 7: రొయ్యల చెరువు గట్టు తగాదాలో రైతు, అతని భార్య, కుమారుడిపై సమీప రైతుపై దాడి చేసిన ఘటనపై ఎస్ఐ బత్తిన నాగబాబు శుక్రవారం కేసు నమోదు చేశారు. సిద్ధాపురం గ్రామంలో ఎరిచర్ల ఏసురత్నం కొన్నేళ్లుగా పోరంబోకు స్థలంలో రొయ్యల చెరువు సాగు చేస్తు న్నాడు. గురువారం ఏసురత్నం చెరువు ఎత్తు పెంచుతుండగా మట్టిపడి మురుగుబోదె పూడుకుపోతున్నదని సమీప రైతు గొట్టుముక్కల సత్యనారాయణరాజు అటవీ శాఖాధికారికి ఫిర్యాదు చేశాడు. అధికారి శైలజ వచ్చి స్థలాన్ని పరిశీలించి గట్టు ఎత్తు చేసే పనులు నిలిపివేయాలని ఏసురత్నానికి చెప్పి వెళ్లిపోయారు. దీంతో నాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ సత్యనారాయణరాజు, అతని భార్య, కొడుకులపై ఏసురత్నం ఇనుపరాడ్‌తో దాడి చేశారు. దీంతో సత్యనారాయణరాజుకు గాయాల వడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమపై సత్యనారాయణరాజు దాడి చేశారంటూ ఏసురత్నం, భార్య, కొడుకు ఆకివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి యత్నం.. ముగ్గురి అరెస్ట్

ఉండి, జూన్ 7: కత్తితో ఒక వ్యక్తిపై దాడికి యత్నించిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారానికి చెందిన కిన్నెర వెంకన్నపై కత్తితో దాడి చేయడానికి యత్నించిన పామర్తి నాగరాజు, అతని స్నేహితులు నాగబాబు, సాయిరాంలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.వీరిని భీమవరం కోర్టుకు తరలించగా మేజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉడతపల్లిలో చిరుతపులి దాడి

ఐదు మేకలు మృత్యువాత



పోలవరం, జూన్ 7: చిరుత పులి దాడిలో ఐదు మేకలు మృత్యువాత పడిన సంఘటన ఏలూరు జిల్లా పోలవరం మండలం చేగొండపల్లి పంచాయతీ ఉడతపల్లిలో జరిగింది. ఆటవీక్షేత్రాధికారి ఎన్.దావీదురాజు తెలిపిన వివరాల ప్రకారం పాపికొండల అభయారణ్యం నేషనల్ పార్క్‌లోని ఉడతపల్లిలో రెండు రోజుల క్రితం చంద్రు బుల్లబ్బాయ్ పశువుల పాకపై చిరుత దాడి చేసింది. ఐదు మేకలు మృత్యువాత పడడంతో సంఘటనా స్థలిని శుక్రవారం పరిశీలించామన్నారు. పాదముద్రల ద్వారా చిరుత దాడిగా ధ్రువీకరించి పశువుల యజమానికి పరిహారం అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిరుత సంచారం తెలుసుకోవడానికి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మెత్తప్పకోట, ఉడతపల్లి గ్రామాల్లో పాడిపశువుల రైతులకు చిరుత సంచారంపై తమ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

వాచ్‌మేన్‌పై దాడి

ఏలూరు క్రైం, జూన్ 7 : ఓ స్థలానికి సంబంధించిన వాచ్‌మేన్‌పై కొందరు దాడికి పాల్పడ్డారు. నగర శివారు ఆశ్రం ఆసుపత్రి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న స్థలానికి సంబంధించిన వాచ్‌మేన్ కండావు కనకారావు ఈనెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని జాతీయ రహదారి పక్కన అదే రోజు సాయంత్రం మొక్కలు నాటుతుండగా అక్కడ ఎందుకు మొక్కలు నాటుతున్నావంటూ పెరుగుగూడేనికి చెందిన నిర్మలరాజు మరికొందరు గొడవకు దిగారు. ఈ క్రమంలో వాచ్‌మేన్ కనకారావుపై వాళ్ల దాడి చేశారు. గాయాలపాలైన కనకారావును స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుదాఘాతానికి రెండు చూడి గేదెలు బలి

ముసునూరు, జూన్ 7: ముసునూరు మండలం లోపూడి గ్రామంలో విద్యుదాఘాతానికి రెండు చూడిగేదెలు మృతి చెందాయి. రైతులు పేరం గోపిరాజు, పేరం పుల్లయ్యలు శుక్రవారం తమ పశువులను పొలంలోకి మేతకు తోలుకువెళ్ళారు. బుధవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగి, తెగిపడిన తీగల్లో విద్యుత్ ప్రవహించడంతో అవి గేదెలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కొక్క గేదె విలువ రూ. 60 వేలు ఉంటుందని రైతులు వాపోయారు. వీఆర్వో పి.నవీన్‌కుమార్ నివేదికను తహసీల్దార్ జవహర్ బాబికి సమాచారం అందించగా నివేదికను ఉన్నతాధికారులకు పంపి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు.



శిక్షణా సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్

క్యాన్సర్ మరణాలు పెరిగిపోతున్నాయి

ఏలూరు క్రైం, జూన్ 7 : ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం 2022లో భారతదేశంలో 14.1 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు, 9.1 లక్షల మంది క్యాన్సర్ కారణంగా మరణించారని ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం దంత వైద్యులు, గైనకాలజిస్టులు, వైద్యాధికారులతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెండు దశల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ ప్రస్తుతం దేశంలో 38 లక్షల మంది క్యాన్సర్‌తో జీవిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో 75,536 కొత్త క్యాన్సర్ కేసులు, 40,307 మరణాలు నమోదయ్యాయి. భారతదేశంలో 75 ఏళ్ళలోపు క్యాన్సర్ వచ్చే ప్రమాదం 10.6 శాతమని అదే వయసులో క్యాన్సర్‌తో మరణించే ప్రమాదం 72 శాతం ఉందన్నారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్‌లు భారతదేశంలోని మొత్తం క్యాన్సర్ కేసులలో 34 శాతం ఉన్నాయి. ముందస్తుగా గుర్తించడం ద్వారా వీటి నుంచి బయటపడవచ్చన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ ఆధారంగా సరైన రిఫరల్ సిస్టమ్‌ను నిర్ధారిస్తూ, డేటాను పర్యవేక్షించడానికి, నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించడం వల్ల దానిని నియంత్రించడానికి వీలుపడుతుందన్నారు. డాక్టర్ అనూష, డాక్టర్ గంగాభవానీ, డాక్టర్ ఉషా కిరణ్, డాక్టర్ అనూష, డాక్టర్ నజరీన్, డాక్టర్ లక్ష్మీ సరస్వతి, డాక్టర్ పి.కీర్తి ప్రియాంక, డాక్టర్ హేమంత్ పాల్గొన్నారు.

రేపు వీఆర్వోల రాష్ట్ర కమిటీ సమావేశం

ఏలూరు రూరల్, జూన్ 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్రకమిటీ అత్యవసర సమావేశం ఈనెల 9వ తేదీ ఆదివారం విజ యవాడ, గాంధీనగర్‌లో ఉన్న ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహి స్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రకమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్ష కార్య దర్శులు తప్పనిసరిగా కమిటీ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



పెద్ద తిరుపతికి కాలినడకన..

నూజివీడు, జూన్ 7: టీడీపీ అధికారంలోకి రావాలని మొక్కుకున్న ఆ పార్టీ నాయకులు కూటమి అధికారంలోకి రావడంతో మొక్కు తీర్చుకుంటున్నారు. తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గద్దె రఘుబాబు టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని మొక్కుకున్నారు. ఆ మేరకు చిన్న తిరుపతి నుంచి పెద్ద తిరుపతి శ్రీవారి సన్నిధికి సన్నిధికి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గద్దె రఘుబాబు చేస్తున్న పాదయాత్ర కావలి దాటిన క్రమంలో ఆయన స్నేహితులు, ముసునూరు మండల తెలుగుయువత నాయకులు యలమంచలి శ్రీకాంత్, గోగినేని మధుకిరణ్, ఇతర తెలుగుయువత నాయకులు రఘుని కలిసి అభినందించారు.



కాలినడకన ద్వారకా తిరుమలకు..

చాట్రాయి, జూన్ 7: నూజివీడు ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి, సీఎంగా చంద్రబాబు గెలుపొంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే కాలినడకన ద్వారకా తిరుమల వెంకన్న దర్శనానికి వస్తామని మండలంలోని చిన్నంపేట గ్రామ టీడీపీ కార్యకర్తలు మొక్కుకున్నారు. ఆ మేరకు జిల్లా టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం 30 మంది టీడీపీ కార్యకర్తలు, అభిమానులు చిన్నంపేట నుండి గోవింద నాయస్మరణ చేసుకుంటూ కాలినడకన బయలుదేరి వెళ్ళారు.

కొల్లు రవీంద్రకు సత్కారం



కలిదిండి, జూన్ 7 : మచిలీపట్నం టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కలిదిండి మండల టీడీపీ నేతలు శుక్రవారం మచిలీ పట్నంలో కలసి సత్కరించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అండ్రాజు శ్రీనివాస్, నాయకులు నాగిడి వీరబ్రహ్మం, తిరుమాని రంగారావు, మోకా నరసింహస్వామి, అండ్రాజు నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాను కలసిన తెలుగు తమ్ముళ్లు



ముదినేపల్లి, జూన్ 7 : కూటమి రాష్ట్రంలో సాధించిన ఘన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తుల్లో మరిన్ని విజయాలు సాధించేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు సూచించారు. శుక్రవారం టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్ నాయకత్వంలో ముదినేపల్లి మండల టీడీపీ నాయకులు రెడ్డి నాగరాజు, వీరిశెట్టి కొండలరావు, గుండాబత్తిన రాజేష్ తదితరులు గొల్లపూడిలో దేవినేని ఉమాను కలసి కూటమి విజయం పట్ల అభినందనలు తెలిపారు.



షరీఫ్‌ను కలసిన మైనార్టీ నేతలు

కైకలూరు, జూన్ 7: ఎన్నికల్లో కూటమి విజయం సాధించేందుకు అంతా కృషి చేయడం అభినందనీయమని శాసనమండలి మాజీ చైర్మన్ ఎండీ షరీఫ్ అన్నారు. శుక్రవారం నరసాపురంలో ఆయన ఇంటి వద్ద కైకలూరు టీడీపీ నేతలు, ముస్లిం మైనార్టీ నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికల్లో రెండు పర్యాయాలు కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ విజయం కోసం నియోజకవర్గంలో షరీఫ్ పర్యటించి మద్దతు తెలిపి గెలుపునకు కృషి చేశారన్నారు. ఎన్నికల్లో ప్రజలు అపూర్వ విజయాన్ని అందించారని సుపరిపాలన అందించి రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తారని షరీఫ్ ధీమా వ్యక్తం చేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు. టీడీపీ కైకలూరు పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ రకీబా, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ బాషిద్, కైకలూరు మండల ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, కలిదిండి మండలం సోషల్ మీడియా కన్వీనర్ అబ్దుల్ అస్లాం, షేక్ అన్వర్‌బాషా, ఎండీ బాబు, జిలానీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 36 అమలుకు వినతి



ముదినేపల్లి, జూన్ 7 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఐదేళ్ల క్రితం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 36ను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ నాయ కుడు, రాష్ట్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ తొండెపు దశరథ జనార్దన్‌రావును కలసి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, ఉమ్మడి కృష్ణా జిల్లా యూనియన్ నాయకులు మెమోరాండం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, జూన్ 7: నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో గల సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎ.సత్యనారాయణ తెలిపారు. నూజివీడు పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఉషా బాలానగర్, మైలవరం రోడ్డు, గాంధీనగర్, రెడ్డిగూడెం, గొడుగువారిగూడెం, నందనంతోట, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, యానాదుల కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్రైం సమాచారం

కొబ్బరి చెట్టు పైనుంచి పడి ఒకరి దుర్మరణం

చాట్రాయి, జూన్ 7: మండలంలోని నరసింహారావుపాలెంలో శుక్రవారం కొబ్బరి బొండాలు కోసేందుకు చెట్టు ఎక్కిన పరసా ఏసు (50) ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏసు కొబ్బరి బొండాలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతానికి రెండు చూడిగేదెలు బలి

ముసునూరు, జూన్ 7: లోపూడిలో విద్యుదాఘాతానికి రెండు చూడిగేదెలు మృతి చెందాయి. రైతులు పేరం గోపిరాజు, పేరం పుల్లయ్యలు శుక్రవారం తమ పశువులను పొలంలోకి మేతకు తోలుకువెళ్ళారు. బుధవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగి, తెగిపడిన తీగల్లో విద్యుత్ ప్రవహించడంతో అవి గేదెలకు తగిలి విద్యుదా ఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కొక్క గేదె విలువ రూ. 60 వేలు ఉంటుందని రైతులు వాపోయారు.

కోటలో మళ్లీ పాగా..

నూజివీడు మండలంపై పట్టు సాధించిన టీడీపీ

17 గ్రామాల్లో మెజారిటీ



నూజివీడు టౌన్, జూన్ 7: నూజివీడు మండలంలో టీడీపీ మళ్లీ తన పట్టును నిలుపుకుంది. టీడీపీకి కంచుకోటగా పేరున్న నూజివీడు మండలం గత ఎన్నికల్లో మాత్రం వైసీపీకి మెజార్టీ వచ్చింది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నూజివీడు మండలంలోని 28 గ్రామాల్లో దాదాపు 17 గ్రామాల్లో టీడీపీ మెజార్టీ సాధించటం విశేషం. మండలంలో టీడీపీకి మొత్తం 25,641 ఓట్లు నమోదు కాగా, వైసీపీకి 24,335 ఓట్లు వచ్చాయి. 1306 ఓట్లు మెజార్టీని తెలుగుదేశం పార్టీ సాధించింది. మండలంలో దిగవల్లి, మిట్టగూడెం, అన్నవరం, బత్తులవారిగూడెం, రావిచర్ల, పాతరావిచర్ల, రామన్నగూడెం, పొలసానపల్లి, గొల్లపల్లి, మీర్జాపురం, మర్రిబంధం, ఎంఎన్ పాలెం, పల్లెర్లమూడి, సీతారాంపురం గ్రామాల్లో టీడీపీ మెజార్టీ ఓట్లను సాధించింది. తుక్కులూరు, మొర్సపూడి, దేవరగుంట గ్రామాల్లో స్వల్పస్థాయిలో పది ఓట్ల లోపు టీడీపీ మెజార్టీ సాధించగా, వైసీపీ తూర్పుదిగవల్లి, ముక్కొల్లుపాడు, హనుమంతులగూడెం, వెంకటాయపాలెం, కొత్తూరు, నర్సుపేట, సుంకొల్లు, యనమదల, బోర్వంచ, పోతురెడ్డిపల్లి, జంగంగూడెం గ్రామాల్లో మెజార్టీ సాధించింది. మొత్తంమీద వైసీపీ తన ప్రభావాన్ని 11 గ్రామాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

మూడో స్థానంలో నోటా!

సార్వత్రిక ఎన్నికల్లో నూజివీడు నియోజకవర్గంలో ఓట్ల సాధనలో నోటా మూడో స్థానంలో నిలిచింది. తొలిస్థానంలో నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి 1,07,303 ఓట్లు సాధించగా, సమీప ప్రత్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు 95,082 ఓట్లు సాధించారు. నియోజకవర్గంలో మొత్తం పదిమంది ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మరీదు కృష్ణ పోటీలో నిలువగా ఆయనకు నోటాకన్నా తక్కువగా ఓట్లు నమోదు అవ్వడం విశేషం. ఈ నియోజకవర్గంలో నోటాకు 2,757 ఓట్లు నమోదు కాగా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మరీదు కృష్ణకు 2,389 ఓట్లు, మరో జాతీయ పార్టీ బీఎస్పీ అభ్యర్థి సీహెచ్ వెంకటేష్‌కు 1286 ఓట్లు నమోదయ్యాయి. ఇక మిగిలిన వారు పేలవమైన ప్రదర్శనను నమోదు చేశారని చెప్పవచ్చు. స్వతంత్ర అభ్యర్థులుగా నిలిచిన పాము రవీంద్ర నాథ్‌కు 437 ఓట్లు నమోదు కాగా, మందలపు శ్రీనివాసరావుకు 226, సోము వెంకట పూర్ణచంద్రరావుకు 178, కొలుసు కమల లక్ష్మికి 115, బోట్ల శివ సత్యనారాయణకు 115, ఆమదాల ఇస్సాకుకు 98 ఓట్లు సాధించారు. ఓట్ల సరళిని బట్టి చూస్తే ఎన్నికల బరిలో నిలిచిన తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరువాత నోటాకే అత్యధికంగా ఈవీఎం ఓట్లు నమోదు అయ్యాయి.

చాట్రాయి మండలంలో...

చాట్రాయి: గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ సార్వత్రిక ఎన్నికల్లో చాట్రాయి మండలంలో టీడీపీకి 1047 ఓట్లు మెజారిటీ రావటంతో వైసీపీ నాయకులు ఖంగుతిన్నారు. ఈ ఎన్నికల్లో 14 గ్రామాల్లో టీడీపీకి, 4 గ్రామాల్లో వైసీపీకి మెజారిటీ రావటం గమనార్హం. మండల చరిత్రలో 2009లో టీడీపీ అభ్యర్థి చిన్నం రామకోటయ్యకు మాత్రమే 185 ఓట్లు మెజారిటీ వచ్చింది. మళ్ళీ ఇప్పుడు 1047 ఓట్లు మెజారిటీ రావటం విశేషం. ఇరు పార్టీలకు వచ్చిన మెజారిటీ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీకి కృష్ణారావుపాలెంలో 12 ఓట్లు, చనుబండలో 230, చిన్నంపేటలో 16, కోటపాడులో 104, చీపురుగూడెంలో 312, మంకొల్లులో 65, ఆరుగొలనుపేటలో 161, చాట్రాయిలో 383, పోలవరంలో 161, జనార్దనవరం 162, మర్లపాలెం 209, తుమ్మగూడెం 320, చిత్తపూరు 2, సోమవరం 159, కొత్తగూడెం 140 ఓట్ల ఆధిక్యత వచ్చింది. వైసీపీకి నరసింహారావుపాలెంలో 419 ఓట్లు, పర్వతాపురం 180, పోతనపల్లి 406, బూరుగ్గూడెం 384 ఓట్లు మెజారిటి వచ్చింది. మండలంలో 2014లో వైసీపీకి 2700 ఓట్లు, 2019లో 3300 ఓట్లు మెజారిటీ వచ్చింది.

చంద్రబాబును కలసిన పూర్ణచంద్రరావు



చాట్రాయి, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో కూటమిని విజయపథాన నడిపించిన టీడీపీ అధినేత చంద్రబాబును గురువారం రాత్రి టీడీపీ మండల నాయకుడు మంచిన పూర్ణచంద్రరావు ఉండవల్లిలో ఆయన గృహంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీయంగా అధికారం చేపట్టగానే రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకం మొదలైన పనులు పునఃప్రారంభించి నవ్యాంధ్రను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు మోరంపూడి జయరామ్ కూడా చంద్రబాబును కలిశారు.



కొల్లు, కాగితలకు బీసీ నాయకుల అభినందన

చాట్రాయి, జూన్ 7: కూటమి అభ్యర్థులుగా పోటీ చేసి మచిలీపట్నం, పెడన ఎమ్మెల్యేలుగా విజయం సాధించిన కొల్లు రవీంద్ర, కాగిత కృష్ణప్రసాద్‌ను శుక్రవారం చాట్రాయి మండల బీసీ నాయకులు కందుల కృష్ణ, మరీదు శ్రీనివాసరావు, రామకృష్ణ, కేశవులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శస్త్ర చికిత్స చేయించుకొని బందరులో స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణను కూడా వారు పరామర్శించారు.



బలే ఏసురాజును అభినందిస్తున్న గ్రామస్థులు



ముదినేపల్లిలో కూటమి నేతల విజయోత్సవం

కూటమి శ్రేణుల విజయోత్సవాలు

కైకలూరు, జూన్ 7: కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గెలుపు కోసం కొల్లేరు ప్రజలు కట్టుడిగా ఓట్లు వేయడం అభినందనీయమని రాష్ట్ర వడ్డీ సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు అన్నారు. శుక్రవారం శృంగవరప్పాడులో విజయోత్సవాలను నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తూ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌కు జిందాబాద్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఏసురాజు మాట్లాడుతూ ఎన్నికల్లో కొల్లేరు ప్రజలు ఏకతాటిపైకి వచ్చారని తమ సమస్యలను పరిష్కరించే నాయకుడ్ని ఎన్నుకున్నామని ప్రజలందరికి మంచి జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, బీజేపీ నాయకుడు పేరిచర్ల ప్రసాదరాజు, ముంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన విజయం సాధించినందుకు శుక్రవారం ముదినేపల్లిలో కూటమి నాయకులు విజయోత్సవం జరుపుకున్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, బొర్రా చలమయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేంపాటి విష్ణురావు, ముదినేపల్లి మండల శాఖ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వా ఫణీంద్ర, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, ఏఎస్ బాబు, జిల్లా కమిటీ సభ్యుడు మోటేపల్లి హనుమ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు.

అరటి రైతులకు అపార నష్టం

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి

ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



ముసునూరులో నేలకొరిగిన అరటిపంట

ముసునూరు, జూన్ 7: ముసునూరు మండలంలో మూడు గ్రామాల్లో వీచిన ఈదురుగాలుల బీభత్సానికి అరటి పంట తీవ్రంగా దెబ్బతింది. పంట చేతికి వచ్చి గెలలు నరికే సమయంలో పంట నేలపాలై ఆర్థికంగా రైతులకు నష్టపోయారు. ముసునూరులో సూమారు 100 ఎకరాలపైగా అరటిపంట దెబ్బతింది. ముసునూరుకు చెందిన కౌలు రైతు చింతా సూరిబాబు సాగుచేసిన 5 ఎకరాల అరటిపంట గెల దశలో ఉండగా ఈదురుగాలులకు పూర్తిగా నేలకు ఒరిగిపోయింది. సూమారు రూ. 5 లక్షలు నష్టమని రైతు వాపోయాడు. అలాగే మరో కౌలురైతు కొత్త విజయకుమార్‌కు చెందిన ఐదు ఎకరాల పంట తీవ్రంగా దెబ్బతినడంతో కౌలుతో కలిపి రూ. 10 లక్షలు నష్టం వాల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతులు కొప్పుల శ్రీనివాసరావు, తుల్లిమెల్లి రంగరావు, మానికల కొండలుతోపాటు మరికొంతమంది రైతుల అరటిపంట నేలకొరగడంతో నష్టపోయారు. చింతలవల్లి, గోగులంపాడు గ్రామాల్లో సైతం ఈదురుగాలులకు అరటిపంట నేలమట్టం అయింది. నోటిదగ్గరకు వచ్చిన పంట ప్రకృతి వైపరీత్యానికి నేలపాలైవడంతో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

'ఉపాధి'లో ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు



నూజివీడు, జూన్ 7: ఉపాధి హామీ పథకంలో పంట ప్రోత్సాహకాలు ఇస్తూ ఉద్యానవన పంటలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు నూజివీడు ఉపాధి ఏపీవో సోమేశ్వరి అన్నారు. నూజివీడు మండల సర్వసభ్య సమావేశం శుక్ర వారం నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంద ర్భంగా వివిధ శాఖల పరిధిలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అధికారులు వివరించారు. సోమేశ్వరి మాట్లాడుతూ కొబ్బరి, ఆయిల్ పామ్ వంటి ఉద్యాన తోటల్లో ఖోఖో సాగుకు ఉపాధి పథకంలో చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా జంగిల్ క్లియరెన్స్ చేసే సందర్భంలో పూర్తిగా చెట్లను తొలగించేలా వివిధ ప్రభుత్వ శాఖలు తీసుకుంటున్న చర్యలపై అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ చెట్టుకొమ్మల వరకే తొలగిస్తే తిరిగి ఆ చెట్లు చిగురిస్తాయని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టా లని అటవీశాఖ అధికారులు కోరారు. నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారిణి ఆలూరి చాముండేశ్వరి మాట్లాడుతూ తొలకరి వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్బీకేలలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. కావాల్సిన రైతులు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పొందవచ్చని సూచించారు. నూజివీడు ఎంపీడీవో ఎ. కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికా రులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి టీడీపీ చేయూత

ముదినేపల్లి, జూన్ 7 : ముదినేపల్లి శివారు అన్నవరం గ్రామంలో వీరమల్లు సుబ్బయ్య ఇంటి పై కప్పు నిర్మాణానికి స్థానిక బొర్రా బాలసాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎన్నికల సమయంలో డాక్టర్ కామినేని శ్రీనివాస్, టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ పేదరికంలో ఉన్న సుబ్బయ్యకు ఇంటిపై కప్పు వేసుకునేందుకు సహాయం చేస్తామన్న వాగ్దానం మేరకు ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్త బాలసాయి పేరున వినోద్ ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా శుక్రవారం ఈ సహాయాన్ని అందజేశారు.